

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



అక్షర
# రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్ గిరి | శుక్రవారం | 09-10-2026 | సంపుటి : 3 | సంచిక: 245 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 09-10-2026 | VOLUME : 3 | ISSUE : 245 | PAGES: 8 | COST: 2/- |


## 14న సింగరేణి కార్మిక గర్జన సభ



- ముఖ్య అతిథిగా బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సింగరేణి ఎన్నికలు నిర్వహించాలి
- బోనస్ గా లాభాల్లో పూర్తి వాటా అందించాలి
- ఇచ్చిన హామీలు తీర్చాల్సిందే
- బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత హరీష్‌రావు డిమాండ్

2

## విపక్ష నేతలపై కేంద్రం తీరు దారుణం




- ఎన్నికల సంఘం పూర్తి స్వతంత్రంగా వ్యవహరించాలి
- విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి

2



# జ్ఞానేష్ రాజీనామా చేసే వరకు పోరాటం

## ఎన్నికల ప్రక్రియపై ప్రజలు విశ్వాసం కోల్పోయారు

### 'చలో లోక్‌భవన్' ర్యాలీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, అక్టోబర్ 8 :** కేంద్ర ఎన్నికల సంఘం 'సర్' పేరుతో ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చేసి నిజమైన ఓటర్లను తొలగించేలా వ్యవహరిస్తోందని, తద్వారా ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని రెవెన్యూ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అందువల్లే సీఈవో జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేసేవరకు తమ పోరాటం ఆగదన్నారు. ఓట్ల సవరణ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారంటూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండి' కూటమి ఇచ్చిన సేవ్ డెమోక్రసీ పిలుపులో భాగంగా టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం చలో లోక్ భవన్ ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడుతూ దేశంలోని 30 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా పేర్లు డ్రాఫ్ట్ రోల్స్ నుంచి తొలగించడం సరికాదన్నారు. ఓటర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

మిగతా 2వ పేజీలో..

## మోదీ గద్దె దిగు.. లేకుంటే ప్రజలే దింపుతారు



- దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్ల తొలగింపు వెనుక కుట్ర
- ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు బీజేపీ ప్రభుత్వాన్ని రక్షించేవి
- ఓటు బచావో.. దేశ్ బచావో ప్రదర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## ఆరోపణలకు అరెస్టులు సమాధానం కావు



2

- రాహుల్-ప్రియాంకల పోరాటం ప్రజాస్వామ్య చైతన్యానికి స్ఫూర్తి
- ఎన్నికల సంఘం ఆధారాలతో జవాబివ్వాలి



## రెండో రోజూ సందడిగా సారస్ మేలా

- తెలంగాణ సంప్రదాయ వస్త్రాలు, హస్తకళలకు మంచి ఆదరణ
- ఇతర రాష్ట్రాల ఉత్పత్తులకూ భారీ గిరాకీ

3



## 'బతుకమ్మ'ను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు

- అధికారులు, సర్పంచ్‌లు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేయాలి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

2

## ఈ-హెచ్‌ఆర్ఎంఎస్‌తో ఉద్యోగుల డేటా నమోదు

- 15 నాటికి ప్రక్రియ పూర్తి చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

2



## నూతన చట్టాల అమలులో వేగం పెంచాలి

- నేరాల నియంత్రణలో పనితీరు మెరుగుపడాలి
- ఈ-సాక్ష్య, న్యాయస్మృతి, ఈ-సమన్ల, జీరో ఎఫ్ఐఆర్, దర్యాప్తుపై దృష్టి
- డీజీపీ ఆనంద్
- దర్యాప్తు, నూతన క్రిమినల్ చట్టాల అమలులో వెనుకబడిన యూనిట్లతో సమీక్ష

3





## 'యాంత్రీకరణ' పథకం ప్రారంభానికి సిద్ధం

- రాష్ట్ర, కేంద్ర వాటాలతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం
- లబ్ధిదారుల ఎంపికపై కేంద్ర మార్గదర్శకాల కోసం ఎదురుచూపులు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరకాబాద్, అక్టోబర్ 8 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం 202526 నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించి అమలు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ పథకం కోసం రూ.71 కోట్లు కేటాయించగా రూ.63 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రైతులకు మరింత విస్తృతంగా యాంత్రీకరణ ప్రయోజనాలు అందించేందుకు 202627కి రూ.147.99 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఈ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా

మిగతా 2వ పేజీలో..

## నైరుతి రుతుపవనాల తిరోగమనం




2




## సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి

- పన్ను మోసాలపై కఠిన చర్యలు అవసరం
- తెలంగాణకు ఏటా రూ.800 కోట్లకుపైగా ఆదాయ ప్రభావం
- హైదరాబాద్‌లో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి
- ఎస్టీ కౌన్సిల్ సమావేశంలో భట్టి విక్రమార్క

2

## లారీ బీభత్సం ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్ల మృతి

2



# విపక్ష నేతలపై కేంద్రం తీరు దారుణం

**న్యూఢిల్లీ అక్టోబర్ 8 :**

దేశ ప్రజల తరఫున, వారి ఓటు హక్కు రక్షణ కోసం పోరాడుతున్న ప్రతిపక్ష నేతలపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. దిల్లీలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకుని ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాలరాస్తోందని విమర్శించారు. ఎన్నికల ముంగిట వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అక్రమాలపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు మొదటినుంచీ ప్రశ్నిస్తున్నారని, అప్పట్లో వాటిని రాజకీయ విమర్శలుగా కొట్టిపారేసినా ఇప్పుడు ఎన్నికల సంఘం కమిషన్‌లోని కమిషనర్లే అంగీకరించడంతో ఆ ఆరోపణలు నిజమని రుజువయ్యాయని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశ ప్రజల్లో ఎన్నికల ప్రక్రియ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతున్నాయనే నమ్మకం సామాన్య ప్రజల్లో కూడా కలగాలంటే ఎన్నికల సంఘం పూర్తి స్వతంత్రంగా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థను ఈ స్థాయికి దిగజార్చినందుకు బీజేపీ ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. నేడు దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపైనే తీవ్ర చర్చ నడుస్తున్నందున ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడేందుకు బాధ్యులు తప్పుకోవాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు.

# 14న సింగరేణి కార్మిక గర్జన సభ



**హైదరాబాద్, అక్టోబర్ 8:**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సింగరేణి కార్మిక గర్జన పేరుతో ఈనెల 14న రామగుండంలోనిర్వహించే భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ఈ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ఎల్పీ డిప్యూట్ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్ లో టీబీజీకేఎస్, సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులతో గురువారం జరిగిన సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సింగరేణి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నదని విమర్శించారు. కార్మికులే కాదు, అధికారులూ ధర్నాలు చేస్తున్న పరిస్థితి నెలకొన్నదన్నరు. లాభాల్లో పూర్తి వాటా అందించాలని, డిపెండెంట్ ఉద్యోగాలను మెడికల్ బోర్డు నిర్వహించి అర్హులకు ఇవ్వాలని, వెంటనే సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని, సింగరేణి బకాయిలు త్వరగా చెల్లించాలనేవి ప్రధాన డిమాండ్లని చెప్పారు. వీటితోపాటు ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చి మోసం చేశారని, వాటన్నింటిని అమలు చేయాలనే డిమాండ్ తో సభ నిర్వహిస్తున్నామన్నారు. దసరా ముందు లాభాలు డిక్లేర్ చేయడం, లాభాల్లో వాటా ఇవ్వడం ఆనవాయితీ. కానీ పండగ వస్తున్నా లాభాలు డిక్లేర్ చేయలేదు, వాటాల గురించి చెప్పడం లేదు. రెండున్నరేండ్లుగా కాంగ్రెస్ సింగరేణి కార్మికులను మోసం చేసింది.. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు 32శాతం లాభాల వాటా ఇస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో కేవలం 16శాతమే ఇచ్చిందని ఆయన చెప్పారు. మాటల్లో 33శాతం చెప్పి ఇచ్చింది 16శాతం వాటా మాత్రమేనన్నారు. వచ్చిన లాభాల్లో భవిష్యత్ అవసరాల పేరిట పక్కన బెట్టి వాటా పంచారన్నారు.

**ఉత్పత్తి ఎందుకు తగ్గిందో?**

2024-25లోా ఇచ్చింది 12.5శాతం మాత్రమే. అంటే కార్మికులకు తీరని అన్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. అవినీతి, బంధుప్రీతి, పరిపాలన వైఫల్యం వల్ల సింగరేణి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. 2022-23లో రూ.2022 కోట్లు, 2023-24లో రూ.4712 కోట్లు, 2024-25 రూ.6,394 కోట్లు లాభాలు వస్తే ఈ సంవత్సరం డిక్లేర్ చేయలేదని హరీష్‌రావు విమర్శించారు. అందుతున్న సమాచారం ప్రకారం రూ.1800 కోట్లు కూడా మించదన్నారు. ఇంత దారుణంగా మూడు వంతుల లాభాలు తగ్గడం అంటే సింగరేణి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. దీనికి కారణం పరిపాలనా వైఫల్యం కాదా అని అడిగారు. రేవంత్ తుగ్లక్ నిర్ణయాల వల్ల లాభాలు పడిపోతున్న పరిస్థితి ఉందని, కార్మికులు మాత్రం అద్భుతంగా పని చేస్తున్నారని చెప్పారు. ఔట్ పుట్ ఫర్ మ్యాన్ షిఫ్ట్ చూస్తే గతంలో 6.39 టన్నులు ఉంటే ఈ ఏడాదికి 7.56కు పెరిగిందని, కార్మికులు కష్టం చేశారు కానీ అడ్డగోలు నిర్ణయాలు సింగరేణిని నష్టాల బాట పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సైట్ విజిట్ సర్టిఫికేట్ పెట్టడం, నెలలతరబడి టెండర్లు వాయిదా వేయడం, అధిక ధరలకు టెండర్లు కట్టబెట్టడం, రేవంత్ బామ్మర్దికి టెండర్లు ఇవ్వడం వల్ల ఇదంతా జరిగిందని ఆరోపించారు. 2023-24లో 70 మిలియన్ టన్నుల నుంచి 2025-26కు 58 మిలియన్ టన్నులకు బొగ్గు ఉత్పత్తి తగ్గిందని, నిజాయతీగా పని చేసే అధికారులను, మంచి డైరెక్టర్లను తొలగించి సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారని ఆరోపించారు.

**మీ నిర్వాకం వల్లే ఈ పరిస్థితి**

సకాలంలో మైన్స్ ఓపెన్ చేయక, కాంట్రాక్టర్లకు పేమెంట్స్ ఇవ్వక నష్టాలకు వెళ్తున్నది.. మీ నిర్వాకం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని హరీష్‌రావువిమర్శించారు. రాష్ట్రంలో బొగ్గు లేక థర్మల్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి ఆపేశారని, బొగ్గు లేక కరెంట్ ఉత్పత్తి చేయక రైతులు రోడ్లమీదకు వచ్చి ధర్నాలు చేస్తున్నారన్నారు. సింగరేణికి చెల్లింపులు రూ.50వేల కోట్లు దాకా ఆగిపోయాయని, ప్రభుత్వం నుంచి, జెన్కో నుంచి చెల్లింపులే లేవని అన్నారు. వాటా పంచకుండా రూ.6323 కోట్ల లాభాలను బ్యాంకుల్లో దాచిపెట్టారు.. మరి రూ.4వేల కోట్ల ఓడీ ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. జీతాలు ఇవ్వాలంటే ఎందుకు అప్పులు తేవాల్సిన పరిస్థితి వచ్చిందని నిలదీశారు. పదేండ్ల బిఆర్ఎస్ హయాంలో ప్రతి సంవత్సరంలో లాభాలు పెరిగాయి.. కరోనా వచ్చినా లాభాలు తగ్గలేదు.. కాంగ్రెస్ రాగానే ఉత్పత్తి, కార్మికుల వాటా ఎందుకు తగ్గింది, లాభాలు ఎందుకు తగ్గుతున్నాయి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**2019లో కేసీఆర్ జీవో ఇచ్చారు**

జీవో 76 మేం తెచ్చినం అని అసెంబ్లీలో గొప్పలు చెప్పుకున్నరు.. ఇంటి హక్కులు కార్మికులకు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ 2019లో జీవో ఇచ్చారన్నారు. కానీ పొంగులేటి వైఎస్ హయాంలో జీవో ఇచ్చినం అని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సింగరేణి ప్రాంతంలో 30వేల మందికి ఇండ్లకు రిజిస్ట్రేషన్ చేసి అప్పగించారు.. కాంగ్రెస్ రాగానే జీవోను పక్కనబెట్టి నిషేధిత జాబితాలో పెట్టారని ఆరోపించారు. ఒక్క మంచిర్యాలలోనే వేల జాగలు నిషేధిత జాబితాలో పెట్టారన్నారు. మూడేళ్లు ఏం చేయకుండా బిగ్ రిలీఫ్, కార్మికులకు శుభవార్త అంటున్నరు.. మూడేళ్లు కార్మికుల ఉసురు పోసుకున్నందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే జీవో 76 కింద మిగిలిన కార్మికులకు సేల్ డీడ్ ద్వారా హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బిఆర్ఎస్ హయాంలో వలే కార్మికులకు ప్రతి నెలా మూడు మెడికల్ బోర్డులు పెట్టి డిపెండెంట్ ఉద్యాగాలు ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. కేసీఆర్ 16వేల డిపెండెంట్ ఉద్యోగాలు . 4వేల మందికి పరీక్ష నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చారు. మొత్తంగా 20వేల మందికి ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. డిపెండెంట్ ఉద్యోగాల మీద కాంగ్రెస్ ప్రభుత్వం అప్రకటిత నిషేధాన్ని పెట్టిందన్నారు .సింగరేణిని ప్రైవేటీకరణ చేసే కుట్రలు, చర్యలను మానుకోవాలని, బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సమస్యల పట్ల బిఆర్ఎస్ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం అవుతున్నది. కేంద్రం కూడా సింగరేణికి మైన్స్ కేటాయించాలని, సంస్థను కాపాడుకునేందుకు కేంద్ర బొగ్గు మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి చొరవ చూపాలని కోరుతున్నామన్నారు. కార్మికులు, సింగరేణి ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి రామగుండం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# జ్ఞానేష్ రాజీనామా చేసే వరకు పోరాటం

మొదటి పేజీ తరువాయి...

'సర్' ప్రక్రియలో ప్రతిపక్ష పార్టీలను సంప్రదించడం లేదన్నారు. స్థానిక ఓటర్ల నమోదు అధికారుల అధికారాలను బలహీనపరిచేలా ఈసీనెట్ వ్యవస్థను వినియోగించారని, ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించకుండా అధికార పక్షానికి కొమ్ముకాసేలా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించినందున సీఈవో జ్ఞానేశ్ కుమార్ తక్షణం రాజీనామా చేయాలని, అంతవరకు తమ పోరాటం ఆగదని మంత్రి పొంగులేటి మరోసారి స్పష్టం చేశారు.

**మహేశ్ గౌడ్, మంత్రుల అరెస్ట్ : లోక్‌భవన్ వద్ద ఉద్రిక్తత**

లోక్‌భవన్ వద్ద ఆందోళనకు దిగిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులను పోలీసులు అరెస్టు చేశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో లోక్‌భవన్‌కు కాంగ్రెస్, టీజేఎస్, లెఫ్ట్ పార్టీలు పిలుపునిచ్చాయి. కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు భారీ ఎత్తున తరలి వచ్చాయి. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, 'ఇండి' కూటమి రాష్ట్ర నేతలు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఖైరతాబాద్ నుంచి లోక్‌భవన్ వైపు ర్యాలీగా బయలుదేరిన నేతలను అడ్డుకున్నారు. లోక్‌భవన్‌కు 300 మీటర్ల దూరంలో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ర్యాలీని అడ్డుకున్న పోలీసులపై మంత్రులు, ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు దేశవ్యాప్తంగా 'ఇండి' కూటమి ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి.

# మోదీ గద్దె దిగు.. లేకుంటే ప్రజలే దింపుతారు

దిల్లీ, అక్టోబర్ 8 : ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని దొడ్డిదారిన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తే ప్రజలు తిరుగుబాటు చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, సీబీఐ దాడులు ఇకపై బీజేపీ ప్రభుత్వాన్ని ఏమాత్రం రక్షించలేవన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన గద్దెను ఖాళీ చేయాలని, లేకపోతే ప్రజలే ఆయనను గద్దె దించుతారని రేవంత్‌రెడ్డి అన్నారు. ఓటు బచావో.. దేశ్ బచావో ఉద్యమంలో భాగంగా విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, ఇండి కూటమి నేతలు మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్ వరకు గురువారం ప్రదర్శన నిర్వహించారు. రాజ్‌ఘాట్ వద్ద నివాళుల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఈ ఉద్యమం కాంగ్రెస్ పార్టీ పోరాటం కోసమో, ఇండి కూటమి కోసమో కాదని, దేశంలోని సామాన్యుల హక్కుల పరిరక్షణ ఉద్యమమని అన్నారు. 2014 ఎన్నికల నాటికి దేశంలో 81 కోట్ల మంది ఓటర్లు ఉంటే 2019 నాటికి





ఆ సంఖ్య 91 కోట్లకు చేరిందని సీఎం గుర్తు చేశారు. 2024 నాటికి 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. దేశ జనాభా 140 కోట్లకు చేరుకుందని, ఓటర్ల సంఖ్య మరింతగా పెరగాల్సింది పోయి ఏకంగా 13 కోట్ల ఓట్ల గల్లంతు అయ్యాయని, అవి ఎలా తగ్గిపోయాయో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, భగత్ సింగ్ వంటి వారు ప్రాణాలకు తెగించి పోరాడి స్వాతంత్ర్యం తెచ్చారని సీఎం అన్నారు. సంపన్నులు, పేదలు తేడా లేకుండా డాక్టర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించారన్నారు. ఇప్పటివరకు 'సర' ఎన్నిసార్లు జరిగినా పేదల ఓట్లకు ముప్పు కలగలేదన్నారు. ఇప్పుడు మాత్రం రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అణగారిన వర్గాల నుంచి గుంజుకునేందుకు ప్రధానమంత్రి మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రయత్నిస్తున్నారని సీఎం ఆరోపించారు. ఎన్నికల సంఘం తప్పులను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై పోలీసులతో దాడులు చేయించడం, ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన నేతలను ఎన్నికల సంఘం కలవకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని సీఎం మండిపడ్డారు. కులం, మతం, ప్రాంతం, భాషల పేరుతో దేశ ప్రజలను విభజించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. దేశ ప్రజలను ఓటు ఉన్నవాళ్లు, ఓటు లేనివాళ్లుగా, రెండు వర్గాలుగా విభజిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి అనుకూలంగా ఉన్నవాళ్లు ఒకవైపు, వ్యతిరేకంగా ఉన్న పేదలు మరోవైపు అన్నట్లుగా మోదీ, జ్ఞానేష్ కుమార్ పరిస్థితులను మార్చారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా తీర్పునిచ్చే దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీ ఓట్లను లక్ష్యంగా చేసుకుని వారి ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు.

# ఆరోపణలకు అరెస్టులు సమాధానం కావు

**హైదరాబాద్, అక్టోబర్ 8:**

'ఓటు చోరీ' ఆరోపణలపై సమాధానం అడిగిన ప్రజాప్రతినిధులను నిర్బంధించడం అధికార దర్పానికి నిదర్శనమని నీటిపారుదల, పౌర సరఫరాల శాU మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విరుచుకుపడ్డారు. ఓటర్ల జాబితాలపై వచ్చిన ప్రశ్నలకు బ్యారికేడ్లు సమాధానం కావని ఒక ప్రకటనపలో పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని పోలీసు బలంతో సంపాదించలేరని, ప్రతి ఓటు విలువను కాపాడేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని అరెస్టులు, కేసులతో అణచివేయాలని చూడటం కేంద్ర ప్రభుత్వ భ్రమ అని మంత్రి ఉత్తమ్ తీవ్రంగా విమర్శించారు. ఈనెల 6, 7 తేదీల్లో దిల్లీలో జరిగిన నిరసనలు, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్న పరిణామాలపై ఆయన స్పందించారు. కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రజల తరఫున ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు వచ్చిన నాయకులను అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన ఖండించారు. తనపై నమోదయ్యే ప్రతి ఎఫ్ఐఆర్‌ను పతకంగా భావిస్తానన్న రాహుల్ వ్యాఖ్య ఆయన పోరాట పటిమను చాటిందన్నారు. రోడ్డుపై నిరసన కొనసాగించిన ప్రియాంక ధైర్యాన్ని అభినందించారు. ప్రజల తరఫున నిలబడిన నాయకులపై కేసుల సంఖ్య పెంచితే ప్రజల మనసుల్లో పెరుగుతున్న ప్రశ్నలు తగ్గిపోతాయనుకోవడం పాలకుల పొరపాటు అని వ్యాఖ్యానించారు. 'ఒక అర్హుడి పేరు ఓటర్ల జాబితా నుంచి అన్యాయంగా తొలగిపోతే అతని గొంతును ప్రజాస్వామ్య ప్రక్రియ నుంచి తొలగించినట్టే.. అందుకే ఓటర్ల జాబితాలపై వచ్చే ప్రతి అభ్యంతరాన్ని అత్యంత బాధ్యతతో పరిశీలించాలి.. ఎవరికైనా ఒకే ప్రమాణం ఉండాలి' అని ఉత్తమ్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆరోపణలను ఖండించినప్పటికీ పేర్ల చేర్పులు, తొలగింపులకు అనుసరించిన ప్రమాణాలు, ప్రభావిత ఓటర్లకు కల్పించిన అభ్యంతరాల అవకాశాలు, వాటిపై తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టంగా లేవనెత్తిన ఆరోపణలపై స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పరిశీలన జరగాలన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న ప్రతిపక్ష డిమాండ్‌కు మద్దతు తెలిపారు. రాహుల్ నాయకత్వంలో ఎన్నికల విశ్వసనీయత అంశం జాతీయ చర్చలో ప్రధానంగా నిలిచిందని ఉత్తమ్ తెలిపారు. ప్రజల ఓటు విలువను కాపాడేందుకు ప్రతిపక్ష ఎంపీలతో కలిసి ఆయన సాగిస్తున్న పోరాటం ప్రజల్లో ధైర్యాన్ని, ప్రశ్నించే చైతన్యాన్ని పెంచుతోందని పేర్కొన్నారు. ఎన్నికల పారదర్శకత కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో సాగుతున్న పోరాటానికి సంపూర్ణ మద్దతుగా నిలుస్తామని ఉత్తమ్ అన్నారు.

# ఈ-హెచ్‌ఆర్‌ఎంఎస్‌తో ఉద్యోగుల డేటా నమోదు

**హైదరాబాద్, అక్టోబర్ 8:**

రాష్ట్రంలో మరింత పారదర్శక పరిపాలన అందించేందుకు ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈహ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈహెచ్‌ఆర్‌ఎంఎస్)లో పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఈ హెచ్‌ఆర్‌ఎంఎస్ అమలు, ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ విధానాలపై అన్ని శాఖల ఉన్నతాధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల నియామకం, సర్వీస్ రికార్డులు, జీతభత్యాలు, పదోన్నతులు, ఏసీఆర్‌లు, ఇతర ఉద్యోగ సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులోకి తేవాలని సూచించారు. సుమారు 3.48 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన డేటాను ఈ హెచ్‌ఆర్‌ఎంఎస్ లో నమోదు చేస్తున్నట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. మొత్తం 38,710 కార్యాలయాలకు సంబంధించిన డేటాలో ఇప్పటికే సుమారు 93 శాతం పూర్తి చేసినట్లు తెలపగా మిగిలిన ప్రక్రియను 15 నాటికి పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

**భవిష్యత్తులో డిజిటల్ అనుమతులకే ప్రాధాన్యం**

పరిపాలనలో పారదర్శకత, వేగం, సామర్థ్యాన్ని పెంచేందుకు భవిష్యత్తులో అన్ని రకాల ప్రభుత్వ అనుమతులు, ఉత్తర్వులను సాధ్యమైనంత వరకు డిజిటల్ విధానంలోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ఆర్థిక శాఖకు సంబంధించిన ఈశాంక్షన్ ఉత్తర్వులను పూర్తిగా డిజిటల్ విధానంలోకి తేవాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక సేవలు, మంజూరులు, చెల్లింపులకు సంబంధించిన ప్రక్రియలను ఆన్‌లైన్‌లో నిర్వహించేలా వ్యవస్థలను సమన్వయం చేయాలన్నారు.

**పనులన్నీ ఆన్‌లైన్‌లోనే**

ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక అనుమతుల ప్రక్రియను కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని సీఎస్ తెలిపారు. అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నుంచి చీఫ్ ఇంజనీర్ (సీఈ) వరకు సాంకేతిక అనుమతుల ప్రక్రియను డిజిటల్ విధానంలో చేపట్టాలని సూచించారు. అలాగే లబ్దిదారులకు నేరుగా అందించే డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) మంజూరులను ఆధార్ ఆధారిత ధ్రువీకరణతో పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**డిజిటల్ పరిపాలనకు నోడల్ అధికారులు**

ఈ హెచ్‌ఆర్‌ఎంఎస్ తోపాటు అన్ని డిజిటల్ విధానాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రతి శాఖలో నోడల్ అధికారిని నియమించాలని సీఎస్ సూచించారు. అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా శాఖల వారీగా సమన్వయం ఉండాలని తెలిపారు. ప్రభుత్వ సేవలను వేగవంతం చేయడంతోపాటు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మరింత ఊతమిచ్చేలా డిజిటల్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్‌లు బి.ఎం.డి.ఎక్కా, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, అహ్మద్ నదీం, క్రిస్టినా చోంగ్తు, శిఖా గోయల్, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, లోకేష్ కుమార్, దివ్య దేవరాజన్, సురేంద్ర మోహన్, హరిచందన, ఇ.శ్రీధర్, సిక్తా పట్నాయక్, విజయేంద్ర, సమాచార, పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'యాంత్రీకరణ' పథకం ప్రారంభానికి సిద్ధం

మొదటి పేజీ తరువాయి..

ఉందని అధికారుల సమావేశంలో తెలిపారు. రాష్ట్ర, కేంద్ర వాటాలతో పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టామని, లబ్దిదారుల ఎంపికకు సంబంధించి కేంద్రం జారీ చేయాల్సిన మార్గదర్శకాల కోసం ఎదురుచూస్తున్నట్లు, అవి అందిన వెంటనే లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ పరికరాన్ని తమకు నచ్చిన ఎంప్యానెల్ చేసిన కంపెనీ వద్ద కొనుగోలు చేసుకునే వెసులుబాటు రైతులకు కల్పించాలని మంత్రి సూచించారు. సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయనుండటం వల్ల రైతులు పరికరం కొనుగోలు చేసే ముందు వివిధ కంపెనీల ధరలను, నాణ్యతను పరిశీలించి, తక్కువ ధరకు నాణ్యత కలిగిన పరికరం ఎక్కడ లభిస్తే అక్కడే కొనుగోలు చేసుకుంటారని మంత్రి సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 60 శాతం, బీసీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందుతుందని మంత్రి తెలిపారు.

**37 రకాల వ్యవసాయ పరికరాలు**

ఈ పథకం కింద రైతులకు అందించేందుకు ప్రస్తుతం 37 రకాల వ్యవసాయ పరికరాలను ఖరారు చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో 19 రకాల పరికరాలు మాత్రమే ఉండేవని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం పరికరాల సంఖ్యను 37కు పెంచినట్లు చెప్పారు. ఇందులో పవర్ టిల్లర్, బ్యాటరీ ఆపరేటెడ్ ఎలక్ట్రిక్ టిల్లర్/వీడర్, డిస్క్ ప్లౌ, కల్టివేటర్, లెవలింగ్ బ్లేడ్, రోటావేటర్, రోటోపుడ్లర్, రివర్సిబుల్ ఎంబీ ప్లౌ, సబ్ సాయిలర్, బండ్ ఫార్మర్, సీడ్‌కంఫెర్టిలైజర్ డ్రిల్, మల్టీ క్రాప్ ప్లాంటర్, రైజ్డ్ బెడ్ ప్లాంటర్, పోస్ట్ హోల్ డిగ్గర్, ప్లాస్టిక్ మల్చ్ లేయింగ్ మెషిన్, ఫెర్టిలైజర్ బ్రాడ్‌కాస్టర్, రిడ్జ్ ఫరో ప్లాంటర్, ట్రాక్టర్ ఆపరేటెడ్ స్లాషర్, పవర్ వీడర్, మాన్యువల్ నాప్‌సాక్ స్ప్రేయర్, పవర్ నాప్‌సాక్ స్ప్రేయర్, ట్రాక్టర్ ఆపరేటెడ్ స్ప్రేయర్, కిసాన్ డ్రోన్, కంబైన్ హార్వెస్టర్, మైజ్ కంబైన్ హార్వెస్టర్, మల్టీ క్రాప్ థ్రెషర్, విన్నోయింగ్ ఫ్యాన్, మైజ్ షెల్లర్, టెలిస్కోపిక్ హార్వెస్టింగ్ పోల్స్, పసుపు బాయిలర్, పసుపు పాలిషర్, ప్యాడీ మొబైల్ డ్రైయర్, స్ట్రా బేలర్, రోటరీ ష్రెడర్, మల్చర్, రోటరీ స్ట్రా స్లాషర్, బ్రష్ కట్టర్ ఉన్నాయి. రైతుల అవసరాలు, సాగు విధానాల్లో వస్తున్న మార్పులు, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని పథకం అమలు మధ్యలో కూడా రైతులకు ఉపయోగపడే కొత్త వ్యవసాయ పరికరాలను చేర్చుకునేలా విధానాలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



**యాంత్రీకరణలో ఎఫ్‌పీవోలకు కీలక పాత్ర**

వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలులో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లను(ఎఫ్‌పీవోలను) భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని ఎఫ్‌పీవోల నుంచి సలహాలు, సూచనలు తీసుకుని, వాటిని పథకం అమలులో ఎలా ఉపయోగించుకోవచ్చో పరిశీలించాలని ఆదేశించారు. చిన్న, సన్నకారు రైతులు ప్రతి వ్యవసాయ పరికరాన్ని సొంతంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి వ్యవసాయ పరికరాలను రైతులకు అద్దెకు అందించే అవకాశాన్ని పరిశీలించాలని కూడా ఆదేశించారు. ఒక్క రైతు ఖరీదైన యంత్రాన్ని కొనుగోలు చేయడం కంటే ఒక ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో పరికరాలను అందుబాటులో ఉంచి అవసరమైన సమయంలో రైతులకు అద్దెకు అందిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువమంది యాంత్రీకరణ ప్రయోజనాలను పొందే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. పథకాన్ని మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు రైతుల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని మంత్రి తుమ్మల తెలిపారు. వచ్చే మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం'లో ఈ పథకంపై రాష్ట్రవ్యాప్తంగా రైతులు, ఎఫ్‌పీవోల ప్రతినిధులతో మాట్లాడి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. ఆ సూచనలను పరిగణనలోకి తీసుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలించి, రైతులకు గరిష్ఠ ప్రయోజనం కలిగేలా పథకానికి తుది రూపం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# లారీ బీభత్సం

- **ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్ల మృతి**
- **మరో ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులకు తీవ్ర గాయాలు**

**ములుగు, అక్టోబర్ 8:**

ములుగు జిల్లా పస్రాతాడ్వాయి మధ్య అటవీ శాఖ చెక్‌పోస్ట్ సమీపంలో జాతీయ రహదారి 163పై ఇసుక లారీ బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన లారీ రెండు వాహనాలను ఢీకొట్టింది. ముందుగా 39వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టిన లారీ ఆగకుండా ముందుకు వెళ్లి రెవెన్యూ శాఖకు చెందిన కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగురం రమాకాంత్(36) అనే జవాన, మరొక జవాను మృతిచెందగా, ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదం అనంతరం పరారైన లారీ డ్రైవర్ కోసం పస్రా పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండో రోజూ సందడిగా సారస్ మేలా

**హైదరాబాద్, అక్టోబర్ 8 :**

హైదరాబాద్‌లో జరుగుతున్న సారస్ మేలా రెండో రోజు కూడా సందడిగా కొనసాగింది. నగరంలోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మేలాకు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. దీంతో వివిధ రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శకులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా తెలంగాణ సంప్రదాయ వస్త్రాలు, హస్తకళలు, గ్రామీణ ఉత్పత్తులకు మంచి డిమాండ్ కనిపించింది. పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతలు, ఇకత్ వస్త్రాలు, చెరియాల్ కళాకృతులు, గిరిజన ఆభరణాలు, జూట్, లెదర్ బ్యాగులు, మట్టి వస్తువులు, పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఆధారిత ఆహార ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అదే సమయంలో గుజరాత్, ఈశాన్య రాష్ట్రాలు సహా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రత్యేక ఉత్పత్తులను కూడా నగరవాసులు ఆసక్తిగా కొనుగోలు చేశారు. స్టాళ్ల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెర్ప్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా సంఘాల సభ్యులు, కళాకారులకు ఉచితంగా భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తోంది. మేళా ప్రాంగణంలో తాగునీరు, పారిశుధ్యం, ఇతర అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించింది. రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆకట్టుకున్నాయి. భరతనాట్యం, జానపద పాటలు తదితర ప్రదర్శనలతో కళాకారులు ప్రేక్షకులను అలరించారు. ప్రత్యేకంగా సెర్ప్ సిబ్బందిలోని పలువురు తమలోని కళా ప్రతిభను ప్రదర్శించడం కార్యక్రమానికి హైలెట్‌గా నిలిచింది. ఉద్యోగ బాధ్యతలతోపాటు తమలోని కళా నైపుణ్యాన్ని ప్రదర్శించిన సిబ్బందిని ప్రేక్షకులు అభినందించారు.

**గ్రామీణ మహిళలకు నగర మార్కెట్‌ను పరిచయం చేసే వేదిక**

సారస్ మేళా కేవలం ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాలకే పరిమితం కాకుండా గ్రామీణ మహిళలకు నగర మార్కెట్‌ను పరిచయం చేసే వేదికగా నిలుస్తోంది. వినియోగదారుల అభిరుచులు, ఉత్పత్తుల నాణ్యత, ధరలు, ప్యాకేజింగ్‌పై నేరుగా స్పందన తెలుసుకునే అవకాశం మహిళా సంఘాలకు లభిస్తోంది. ఇది భవిష్యత్తులో మరిన్ని మార్కెట్ అవకాశాలు, బల్క్ ఆర్డర్లకు దోహదపడనుంది. మహిళల శ్రమకు మార్కెట్, ప్రతిభకు గుర్తింపు, ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటుగా సారస్ మేళా కొనసాగుతోంది. 18వ తేదీ వరకు జరిగే ఈ మేళాను నగరవాసులు సందర్శించి గ్రామీణ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## ‘బతుకమ్మ’ను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు

**హైదరాబాద్, అక్టోబర్ 8 :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా, ఆనందంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, రహదారులు, తాగునీరు, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో దక్షిణాఫ్రికాలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతితో దానికి ఉన్న అనుబంధాన్ని వీడియో సందేశంలో వివరించారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో తెలంగాణ బిడ్డలు బతుకమ్మను ఘనంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పూల పండుగ బతుకమ్మ సందర్భంగా రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని, పూలను, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కలిపి జరుపుకునే ప్రత్యేకమైన పండుగ అని పేర్కొన్నారు. బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక. మన సంస్కృతి, మన సంప్రదాయం, మన ప్రకృతితో ముడిపడిన పండుగ.. ప్రతి ఆడబిడ్డ ఆనందంగా.. ప్రతి కుటుంబం సంతోషంగా.. ప్రతి గ్రామం సురక్షితంగా బతుకమ్మ జరుపుకునేలా ప్రజా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది’ అని మంత్రి సీతక్క తెలిపారు. బతుకమ్మ పండుగ రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని గ్రామాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా పంచాయతీ అధికారులు, కలెక్టర్లు సమన్వయంతో పనిచేసి పండగకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలు, చెరువులు, కుంటలు, ఘాట్‌ల పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు ఉండేలా అవసరమైనచోట్ల రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, వీబీజీ రామ్‌జీ పథకం కింద మట్టి రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బతుకమ్మ వేదికలను ముందుగానే శుభ్రం చేసి సిద్ధం చేయాలని, అవసరమైనచోట్ల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. వేడుకల్లో పాల్గొనే మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అవసరమైనచోట్ల మెట్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ సంస్కృతి**

తెలంగాణలో పుట్టిన బతుకమ్మ పండుగ నేడు ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని మంత్రి సీతక్క అన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్, మధ్యప్రాచ్యం, దక్షిణాఫ్రికా తదితర దేశాల్లో తెలంగాణ ప్రజలు బతుకమ్మను జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ‘ఎక్కడ ఉన్నా తెలంగాణ బిడ్డల గుండెల్లో బతుకమ్మ ఉంటుంది.. పూలను పేర్చి బతుకమ్మను నిలబెట్టినట్టే మన సంస్కృతి, సంప్రదాయాలను కూడా తరతరాలకు నిలబెట్టుకోవాలి.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఆడబిడ్డలంతా ఐక్యంగా, ఆనందంగా బతుకమ్మను జరుపుకోవాలి’ అని అన్నారు. పూల పండుగ బతుకమ్మ ప్రతి ఇంటా ఆనందాన్ని, ప్రతి కుటుంబంలో సంతోషాన్ని, ప్రతి గ్రామంలో ఐక్యతను నింపాలని మంత్రి సీతక్క ఆకాంక్షిస్తూ మహిళలందరికీ ముందస్తు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

## భగీరథ్ కేసుపై వార్తలకు హైకోర్టు ఆంక్షలు

**హైదరాబాద్, అక్టోబర్ 8:**

బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. కేసుకు సంబంధించిన వార్తలు, కథనాలు, వీడియోలను ప్రచురించడం, ప్రసారం చేయడం, షేర్ చేయడం లేదా రీపోస్ట్ చేయడంపై టీవీ ఛానళ్లు, డిజిటల్, సోషల్ మీడియా వేదికలకు ఆంక్షలు విధించింది. భగీరథ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. కేసు వివరాలతో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

**దర్యాప్తు పూర్తికాకముందే ప్రచారంపై అభ్యంతరం**

పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే తనపై మీడియాలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం జరుగుతోందంటూ భగీరథ్ కోర్టును ఆశ్రయించారు. మహిళ ఫిర్యాదు ఆధారంగా బీఎన్ఎస్, పోక్సో చట్టాల కింద కేసు నమోదైందని, దర్యాప్తు క్రమంలో పోక్సో సెక్షన్లలో మార్పులు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. జూన్ 19న మధ్యంతర బెయిల్, జులై 9న రెగ్యులర్ బెయిల్ మంజూరైన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. బెయిల్ లభించినప్పటికీ దర్యాప్తు పూర్తికాకముందే కొన్ని మీడియా, సోషల్ మీడియా వేదికల్లో తనను దోషిగా చిత్రీకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. నిరాధార ఆరోపణలతో తనను రేపిస్ట్, నేరస్థుడిగా పేర్కొంటూ పోస్టులు చేస్తున్నారని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తన చిత్రాలను రావణాసురుడి రూపంలో మార్ఫింగ్ చేసి వైరల్ చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ప్రచారం తన తండ్రి బండి సంజయ్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని ఆరోపించారు.

**గూగుల్, మెటా సహా పలు సంస్థలకు ఆదేశాలు**

తప్పుడు ప్రచారాన్ని నిలువరించాలని కోరుతూ గూగుల్, మెటా, ఎక్స్ కార్ప్, యూట్యూబ్‌తో పాటు పలు టీవీ న్యూస్ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలను భగీరథ్ ప్రతివాదులుగా చేర్చారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, తెలంగాణ డీజీపీని కూడా పిటిషన్‌లో ప్రతివాదులుగా పేర్కొన్నారు. దర్యాప్తు పూర్తికాకముందే ఒక వ్యక్తిని దోషిగా నిర్ధారించేలా ప్రచారం చేయడం, తద్వారా అతని పరువుతో పాటు దర్యాప్తు ప్రక్రియకు విఘాతం కలిగించే చర్యలను తీవ్రంగా పరిగణించింది. కేసుకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచురించడం, ప్రసారం చేయడం, రీపోస్ట్ లేదా ఫార్వర్డ్ చేయవద్దని బ్రాడ్‌కాస్టర్లు, మీడియా సంస్థలు, సోషల్ మీడియా వినియోగదారులను ఆదేశించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాస్తవ వివరాలతో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని సూచిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది

# నైరుతి రుతుపవనాల తిరోగమనం

**హైదరాబాద్, అక్టోబర్ 8 :**

నైరుతి రుతుపవనాల తిరోగన మరేఖ ఇప్పుడు 27.5□N/86.5□E, సుపాల్, రాంచీ, సుందర్‌గఢ్, బర్గఢ్, బీజాపూర్, హైదరాబాద్, బెళగావి, పంజిమ్, 15□N/72□E గుండా వెళుతోందని భారత వాతావరణ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణలో ఈ తిరోగమన రేఖ తాండూర్, వికారాబాద్, హైదరాబాద్, జనగాం, భూపాలపల్లి గుండా వెళుతోంది. రాబోయే 34 రోజుల్లో తూర్పు భారతదేశం, ఉత్తర ద్వీపకల్పంలోని మరికొన్ని ప్రాంతాల నుండి, అలాగే ఈశాన్య భారత్‌లోని అనేక ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాలు మరింతగా తిరోగమించడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నైరుతి రుతుపవనాలు గురువారం మహారాష్ట్రలోని మిగిలిన ప్రాంతాలు, గోవా, కర్ణాటక, తెలంగాణ, ఒడిశాలలోని కొన్ని ప్రాంతాలు, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లలోని మరికొన్ని ప్రాంతాల నుండి మరింతగా ఉపసంహరించుకున్నాయి. నైరుతి రుతుపవనాల ఉపసంహరణ రేఖ ప్రస్తుతం 27.5□N/86.5□E, సుపాల్, రాంచీ, సుందర్‌గఢ్, బర్గఢ్, బీజాపూర్, హైదరాబాద్, బెళగావి, పనాజీ, 115□N/72□E మీదుగా కొనసాగుతోంది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. వాతావరణ హెచ్చరికలు లేవు.

# సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:**

జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్రాన్ని కోరారు. 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నిజాయతీగా పన్నులు చెల్లించే వారికి అనుసరణ ప్రక్రియను సరళీకరించడంతోపాటు ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడే వారిపై జీరో టాలరెన్స్ విధానం కొనసాగాలని స్పష్టం చేశారు. జీఎస్టీ అమలుకు పునాది పరస్పర విశ్వాసమేనన్నారు. ఉమ్మడి జాతీయ మార్కెట్ ఏర్పాటుతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్న నమ్మకంతో రాష్ట్రాలు తమ స్వతంత్ర పన్ను విధించే అధికారంలో గణనీయమైన భాగాన్ని వదులుకున్నాయని గుర్తు చేశారు. కేంద్రం, రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేయడం, రాష్ట్రాల ఆదాయాన్ని కాపాడటం, కీలక మార్పులను సంప్రదింపులు, ఏకాభిప్రాయంతో చేపట్టడం ఈ వ్యవస్థకు మూల సూత్రాలని అన్నారు.



**తెలంగాణపై ప్రభావం**

తెలంగాణ సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వాటా సుమారు 35 శాతం ఉందని భట్టి తెలిపారు. ఈ ఆదాయంతోనే రాష్ట్రంలో పాఠశాలలు, హాస్పిటల్స్, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలకు నిధులు సమకూరుతున్నాయని చెప్పారు. జీఎస్టీ ఆదాయంలో తగ్గుదల కేవలం లెక్కల అంశం కాదని, ప్రజలకు సేవలు అందించే రాష్ట్ర సామర్థ్యంపై నేరుగా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మోటార్ వాహనాలు, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌పుట్ సర్వీసుల రిఫండ్‌లకు సంబంధించిన మార్పులు చేపట్టే ముందు వాటి పూర్తి ఆర్థిక ప్రభావాన్ని రాష్ట్రాలకు వివరించాలని కోరారు. మోటార్ వాహనాల విషయంలో కేంద్రం అందించిన అంచనాల ప్రకారం తెలంగాణకు ఏడాదికి సుమారు రూ.800 కోట్ల ఆదాయ ప్రభావం ఉంటుందని, రాష్ట్ర సొంత అంచనాల ప్రకారం ఈ నష్టం అంతకంటే రెట్టింపు కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. తగిన సందర్భాల్లో ఆటోమేటిక్ జీఎస్టీ రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ మార్పులు, రద్దు దరఖాస్తుల ఆటోమేటిక్ ప్రాసెసింగ్‌కు భట్టి మద్దతు తెలిపారు. రిస్క్ లేని కేసుల్లో ఆటోమేటిక్‌గా రిఫండ్‌లు మంజూరు ద్వారా నిజాయతీగల పన్నుదారులకు త్వరగా ప్రయోజనం అందుతుందన్నారు. అదే సమయంలో అధిక రిస్క్ ఉన్న కేసులపై పన్ను అధికారులు మరింత దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. పెనాల్టీలను హేతుబద్ధీకరించడం, రహదారులపై సరకుల వాహనాలను యాదృచ్ఛికంగా నిలిపివేయడాన్ని తగ్గించడం వంటి చర్యలను స్వాగతించారు. జీఎస్టీ రిటర్నుల్లో అవసరమైన మార్పులు చేసి పన్ను వివరాల్లో తేడాలను తగ్గించాలని, జీఎస్టీ అమలులో స్పష్టత, ఏకరూపత కోసం తగిన సర్క్యులర్లు, వివరణలు జారీ చేయాలని కోరారు.

**నకిలీ రిజిస్ట్రేషన్లపై ఉక్కుపాదం**

పన్నుదారులకు అనుకూలమైన విధానాల అమలుతోపాటు జీఎస్టీ మోసాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు, గుర్తింపు వివరాల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని భట్టి డిమాండ్ చేశారు. వృద్ధులు, గృహిణులు, రోజువారీ కూలీలు, ఇతర అమాయకుల ఆధార్, పాన్ వివరాలను దుర్వినియోగం చేసి మోసపూరిత జీఎస్టీ రిజిస్ట్రేషన్లు సృష్టిస్తున్న ఘటనలను ప్రస్తావించారు. నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందడం లేదా ఇతరులకు బదిలీ చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులు, వ్యవస్థీకృత ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విధానాల సరళీకరణ పేరుతో వ్యవస్థీకృత పన్ను ఎగవేతపై అమలు చర్యలు బలహీనపడకూడదని స్పష్టం చేశారు.

**స్క్రాప్ రంగంపై ప్రత్యేక దృష్టి**

దేశవ్యాప్తంగా స్క్రాప్ రంగంలో జరుగుతున్న పన్ను ఎగవేతను భట్టి ప్రస్తావించారు. అసంఘటిత, నగదు ఆధారిత వ్యవస్థ కారణంగా నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ బదిలీ చేయడం జరుగుతోందని చెప్పారు. అదే సమయంలో ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న చెత్త సేకరించే కార్మికులు, చిన్న స్థాయి సేకరణదారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. స్క్రాప్ రంగం, గుర్తింపు దొంగతనం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి, పేదల ప్రయోజనాలను కాపాడే కార్యాచరణను రూపొందించేందుకు జీఎస్టీ కౌన్సిల్ మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చాలాకాలంగా అధికారుల కమిటీల్లో తెలంగాణకు తగిన ప్రాతినిధ్యం లభించలేదన్నారు. జీఎస్టీ కౌన్సిల్ పునర్వ్యవస్థీకరించే కమిటీల్లో తెలంగాణకు సభ్యత్వం కల్పించాలని కోరారు. స్టాండింగ్ కమిటీ ఆఫ్ ఆఫీసర్స్‌లోనూ తెలంగాణకు ప్రాతినిధ్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**హైదరాబాద్‌లో జీఎస్టీ ప్రాంతీయ కార్యాలయాలు**

హైదరాబాద్ భౌగోళికంగా అనుకూలమైన నగరం మాత్రమే కాదని, టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో దేశంలోని ప్రముఖ కేంద్రాల్లో ఒకటని భట్టి పేర్కొన్నారు. భవిష్యత్ జీఎస్టీ పరిపాలనకు అవసరమైన సాంకేతిక సామర్థ్యాలు హైదరాబాద్‌లో ఉన్నాయని, ఈ నేపథ్యంలో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల జీఎస్టీ పరిపాలన రాష్ట్రాలకు మరింత చేరువ కావడంతోపాటు, సాంకేతికత ఆధారిత పన్ను మోసాల గుర్తింపు వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని అన్నారు. సరకుల వాహనాల తనిఖీల విషయంలో ప్రస్తుతం ఉన్న అధికారాలను మూల రాష్ట్రం, గమ్య రాష్ట్రం రెండింటికీ కొనసాగించాలని సూచించారు. పన్ను ఎగవేతను అరికట్టడంతోపాటు వ్యాపార కార్యకలాపాలకు అనవసరమైన ఇబ్బందులు కలగకుండా సమతుల్య విధానం అవసరమని భట్టి పేర్కొన్నారు. తెలంగాణ వంటి ఎగుమతి రాష్ట్రాల సహకారాన్ని గుర్తించాలని కోరారు. పోటీతో కూడిన ఎగుమతి వ్యవస్థ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు, ప్రజా ప్రయోజనాల కోసం పెట్టుబడులు పెట్టే రాష్ట్రాలకు తగిన మద్దతు, ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. ప్రజారోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు హెల్త్ సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ సెస్సులలో రాష్ట్రాలకు నిర్దిష్టమైన, పారదర్శక వాటా కల్పించాలని కోరారు. జీఎస్టీ ఆదాయం కేంద్రానిదీ, రాష్ట్రాలదీ కాదని.. అది భారత ప్రజలకు చెందినదని భట్టి పేర్కొన్నారు. ప్రజలు కేంద్రం, రాష్ట్రాలపై ఉంచిన విశ్వాసానికి తగిన విధంగా జీఎస్టీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలని కోరారు.

# మెరుగైన పనితీరుతోనే జాతీయ స్థాయిలో రాణింపు

**హైదరాబాద్, అక్టోబరు 8:**

నూతన క్రిమినల్ చట్టాల అమలులో వెనుకబడిన పోలీసు యూనిట్లు పనితీరు మెరుగుపర్చుకోవాలని డీజీపీ సి.వి.ఆనంద్ సూచించారు. నూతన చట్టాల అమలుతోపాటు నేరాల నియంత్రణ, దర్యాప్తు నాణ్యత, నేర నిరూపణ శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా క్రైమ్ ర్యాంకింగ్‌లో వెనుకబడిన యూనిట్ల కమిషనర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో గురువారం సీఐడీ కార్యాలయంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. పనితీరులో మెరుగుదల సాధిస్తేనే జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకు సాధ్యమవుతుందని డీజీపీ సూచించారు. గతంలో ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోపై నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో పలు సూచనలు, జాగ్రత్తలు సూచించడం, వాటిని అమలు చేయడం ద్వారా ఈగల్ , సైబర్ సెక్యూరిటీ బ్యూరో విభాగాలు జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గుర్తింపు సాధించాయన్నారు. ఈగల్ ఫోర్స్ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలవడంతోపాటు, సైబర్ నేరాల నియంత్రణలోనూ తెలంగాణ జాతీయస్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి దేశానికి ఆదర్శంగా నిలిచిందని డీజీపీ కొనియాడారు. ఇదే విధంగా ఇతర అంశాల్లోనూ రాష్ట్రం ముందంజలో నిలవాలంటే క్రమం తప్పకుండా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ లోపాలను గుర్తించి సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని, అప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని సూచించారు. కేసుల పరిష్కారం, లైంగిక నేరాల ట్రాకింగ్ వ్యవస్థ, పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర విచారణ, నేర జరిగిన చోట ఎఫ్ఐఆర్ నమోదు, ఈసాక్ష్య తదితర అంశాలపై యూనిట్ల వారీగా డిజిపి సమీక్షించారు. ప్రతి అంశంలో ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సూర్యాపేట, వనపర్తి, నిర్మల్, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, జీఆర్‌పీ సికింద్రాబాద్ తదితర యూనిట్లతోపాటు హైదరాబాద్, నిజామాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్, కరీంనగర్ కమిషనరేట్ల అధికారులు ఈ ప్రత్యేక సమీక్షా సమావేశానికి హాజరయ్యారు.

నూతన క్రిమినల్ చట్టాల అమలు తీరును జాతీయ స్థాయిలో నాలుగు ప్రధాన విభాగాల ప్రాతిపదికన పర్యవేక్షిస్తున్నారు. అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్‌కు 20 శాతం, ఆపరేషనల్ ఎఫిషియెన్సీకి 45 శాతం, ఐసీటీ అప్లికేషన్‌కు 25 శాతం, ఇంటిగ్రేషన్‌కు 10 శాతం వెయిటేజీ కేటాయించారు. ఈ ప్రమాణాల ఆధారంగానే రాష్ట్రాలు, పోలీసు యూనిట్ల పనితీరును అంచనా వేస్తున్నారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు, నిర్ణీత గడువులో దర్యాప్తు పూర్తి, ఆన్‌లైన్ చార్జిషీట్, ఈసాక్ష్య, ఈసమన్లు, న్యాయస్మృతి, ఐసీజేఎస్ తదితర వ్యవస్థలను సమర్థంగా వినియోగించాలని డీజీపీ సూచించారు. సీసీటీఎన్ఎస్‌లో నమోదవుతున్న సమాచారాన్ని సమర్థంగా వినియోగించాలని, అందులోని డేటాను విశ్లేషించి నేర నియంత్రణకు ఉపయోగపడే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సైబర్ నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, క్రిమినల్స్ పై ప్రత్యేకంగా దృష్టి సారించి నేరాల పునరావృతిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యూనిట్ల స్థాయిలో నూతన చట్టాల అమలుకు సంబంధించి ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను అధికారులు డిజిపి దృష్టికి తీసుకువచ్చారు. అవసరమైతే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందికి నూతన చట్టాలు, సాంకేతిక వ్యవస్థలపై అవగాహన కల్పిస్తామని డీజీపీ తెలిపారు. నూతన క్రిమినల్ చట్టాల అమలులో ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత జయశంకర్ భూపాలపల్లి, రామగుండం కమిషనరేట్ లో నూతన క్రిమినల్ చట్టాలు అంశాలైన ఈ-సాక్ష్య బీఎన్ఎస్ 60 రోజులు 90 రోజుల్లో ఎఫ్ఆర్ చేయడం జీరో ఎఫ్ఐఆర్ వంటి అంశాలలో ముందున్నాయి. కాగా, మల్కాజ్గిరి, హైదరాబాద్, నిజామాబాద్ , కరీంనగర్ కమిషన రేట్లు పనితీరు మెరుగుపరుచాలన్నారు. ఆ జిల్లాల వారీగా చూసినట్లయితే మహబూబ్ నగర్, జీఆర్పీ సికింద్రాబాద్, యాదాద్రి భువనగిరి వీటి అమలులో వెనుకబడినట్టుగపేర్కొన్నారు. కారణాలను కూడా విశ్లేషించారు. వెనుకబడిన యూనిట్లు డీజీపీ కార్యాలయం నుంచి అందించిన సూచనలను క్షేత్రస్థాయిలో అమలు చేసి పనితీరు మెరుగుపర్చుకోవాలని ఆనంద్ సూచించారు. జాతీయస్థాయిలో నూతన క్రిమినల్ చట్టాల అమలు ర్యాంకింగ్‌లో తెలంగాణ 60.15 స్కోర్‌తో నిలిచింది. రాబోయే రోజుల్లో జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్ చార్జిషీట్, ఈసాక్ష్య, ఈసమన్లు, న్యాయ న్యాయస్మృతి వంటి అంశాలను మరింత సమర్థంగా అమలు చేస్తే రాష్ట్ర ర్యాంకింగ్‌ను గణనీయంగా మెరుగుపర్చే అవకాశం ఉందని డీజీపీ పేర్కొన్నారు. నేరాల నియంత్రణతోపాటు దర్యాప్తు నాణ్యతను పెంచి, నేర నిర్ధారణ శాతాన్ని మెరుగుపర్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతన క్రిమినల్ చట్టాల అమలును మరింత పటిష్టం చేసేందుకు త్వరలో మరోసారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి యూనిట్ల పనితీరును సమీక్షిస్తామని తెలిపారు. ఈ ప్రత్యేక సమీక్షలో సీఐడీ డైరెక్టర్ చారు సిన్హాతో పాటు హైదరాబాద్ సీపీ సజ్జనార్, సైబరాబాద్ సీపీ రమేష్, ఐజీ మల్టీజోన్-I చంద్రశేఖర్ రెడ్డి, ఆయా యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

## సుక్మాలో మందుపాతర పేలుడు.. నలుగురు జవాన్లకు తీవ్ర గాయాలు!

**భద్రాచలం, అక్టోబర్ 9:**

: తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సుక్మా జిల్లాలో ఓ మందుపాతర పేలడంతో నలుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. సుక్మా జిల్లా బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని బొడ్రాజ్‌ఫదర్ కల్వర్టు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. కల్వర్టు సమీపంలో గుర్తించిన బాంబును నిర్వీర్యం చేస్తుండగా ప్రమాదవశాత్తు ఒక్కసారిగా పేలింది. దీంతో బాంబు నిర్వీర్య బృందానికి చెందిన నలుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. సుక్మా జిల్లా ఎస్పీ సుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బొడ్రాజ్‌ఫదర్ కల్వర్టు వద్ద బాంబును గుర్తించిన బాంబు నిర్వీర్య బృందం దానిని నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైంది. అయితే, నిర్వీర్యం చేస్తుండగానే పేలుడు సంభవించడంతో అక్కడున్న నలుగురు జవాన్లు గాయపడ్డారు. గాయపడిన వారిలో ఓ ఎస్సై, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఉన్నట్లు సమాచారం. దీంతో వెంటనే వారిని సుక్మా జిల్లా కుంట ఆస్పత్రికి తరలించారు. కుంట ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నలుగురు జవాన్లను భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే, గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్పీ సుకుమార్ తెలిపారు. అలాగే, ప్రస్తుతం భద్రాచలంలోని ఆస్పత్రిలో వైద్యులు గాయపడిన జవాన్లకు చికిత్స అందిస్తున్నారు..



# ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల్లో సవరణలకు అవకాశం

- తప్పులుంటే ఆన్‌లైన్‌లో వివరాల సవరణ
- తిరస్కరణలపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల నమోదుకు అవకాశం
- నియోజకవర్గం, కేటగిరీ వివరాల మార్పునకు వెసులుబాటు
- ఆధార పత్రాలతో క్లెయిమ్‌లు సమర్పించాలని హౌసింగ్ బోర్డు సూచన

**హైదరాబాద్, అక్టోబర్ 8:**

తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోని ఇందిరమ్మ ఇళ్లు అందుబాటు గృహ పథకం దరఖాస్తుదారులకు అధికారులు కీలక అవకాశం కల్పించారు. దరఖాస్తుల్లో నమోదైన వివరాల్లో తప్పులను సరిచేసుకోవడంతో పాటు, తిరస్కరణకు గురైన దరఖాస్తులపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్ ఈ విషయాన్ని వెల్లడించారు. దరఖాస్తుదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు క్యూర్ పోర్టల్‌లో తమ దరఖాస్తు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గం తప్పుగా నమోదై ఉంటే సరైన నియోజకవర్గాన్ని పేర్కొంటూ చెల్లుబాటు అయ్యే నివాస ధ్రువీకరణ పత్రాలను సమర్పించవచ్చు. 'ఔట్ ఆఫ్ కన్స్టిట్యూన్సీ' కారణంగా దరఖాస్తు తిరస్కరణకు గురైన వారు కూడా ఆధారాలతో క్లెయిమ్ చేసుకోవచ్చు. అర్హతకు సంబంధించిన అంశాలు లేదా ఇతర కారణాలతో దరఖాస్తులు తిరస్కరణకు గురైన వారు తమ అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. విద్యుత్ బిల్లులు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ రికార్డులు, ఐజీఆర్ఎస్ వివరాలు తదితర ఆధారాలను క్లెయిమ్‌కు జతచేసే అవకాశం ఉంది. కేటగిరీ వివరాల్లో తప్పులున్నా సరిచేసుకునే వెసులుబాటు కల్పించారు. సంబంధిత కేటగిరీకి సంబంధించిన చెల్లుబాటు అయ్యే ధ్రువపత్రాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సరైన సమాచారం, చెల్లుబాటు అయ్యే ఆధార పత్రాలతోనే క్లెయిమ్‌లు సమర్పించాలని హౌసింగ్ బోర్డు సూచించింది. అందిన క్లెయిమ్‌లను పథక మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం అధికారులు పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. సాంకేతిక సహాయం కోసం 04024603572 నంబర్‌లో హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# ఈసీ నియామకాలపై సుప్రీంకోర్టులో సవాల్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:**

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (CEC) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిల నియామకాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. సూరి పయల (Suri Payala) రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ ముగ్గురు అత్యున్నత పదవుల్లో కొనసాగేందుకు ఉన్న చట్టబద్ధ అధికారాన్ని వెల్లడించేలా 'కో వారెంటో' (Quo Warranto) రిట్ జారీ చేయాలని పిటిషనర్ కోరారు. వారి నియామకాలకు చట్టపరమైన ఆధారం లేదని తేలితే ఆయా పదవులను ఖాళీగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. 2024 మార్చి 14న జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధులను ఎన్నికల కమిషనర్లుగా నియమిస్తూ జారీ చేసిన నోటిఫికేషన్లను పిటిషన్‌లో సవాల్ చేశారు. అలాగే 2025 ఫిబ్రవరి 17న జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీగా నియమించడం, వివేక్ జోషిని ఎన్నికల కమిషనర్‌గా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు.

**చట్ట నిబంధనలు పాటించలేదంటూ ఆరోపణలు**

2023 నాటి చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టంలోని నిబంధనలను పూర్తిస్థాయిలో అనుసరించకుండానే ఈ నియామకాలు చేపట్టారని పిటిషనర్ ఆరోపించారు. ఎన్నికల సంఘం వ్యవహారాలను ఏకపక్షంగా నిర్వహిస్తున్నారంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పనితీరుపై ఇండీ కూటమి, కాక్రోచ్ జనతా పార్టీతో పాటు వివిధ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్న సమయంలో ఈ నియామకాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రముఖ నటుడు నానా పాటేకర్ కన్నుమూత

**గోవా, అక్టోబర్ 8:**



ప్రముఖ సినీనటుడు నానా పటేకర్ (75) గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. గోవాలోని తన నివాసంలో కార్డియాక్ అరెస్ట్‌కు గురై అపస్మారక స్థితిలో కనిపించిన ఆయనను మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు 45 నిమిషాలపాటు సీపీఆర్ నిర్వహించినప్పటికీ ప్రాణాలు కాపాడలేకపోయారు. ఉదయం 5.20 గంటలకు ఆయన మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై మెడికో లీగల్ కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిపారు. తన తండ్రి మరణవార్తను కుమారుడు మల్హార్ పటేకర్ ధ్రువీకరించారు. తాను గోవాకు వెళ్తున్నానని, పూర్తి ప్రకటన త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. హిందీ, మరాఠీ చిత్రాల్లో విలక్షణ నటనతో నానా పటేకర్ ప్రత్యేక గుర్తింపు పొందారు. గంభీరమైన స్వరం, సహజమైన అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో నిలిచారు. విభిన్న పాత్రలకు ప్రాణం పోసిన ఆయన భారతీయ చిత్రరంగంలో తనదైన ముద్ర వేశారు. ఆయన మరణంతో భారతీయ సినిమా ఒక విశిష్ట నటుడిని కోల్పోయింది.

# సీఈసీ జ్ఞానేశ్‌కు మద్దతుగా 42 మంది మాజీ న్యాయమూర్తులు

**ఢిల్లీ:**

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (CEC) జ్ఞానేశ్ కుమార్‌కు మద్దతుగా 42 మంది మాజీ న్యాయమూర్తులు, మాజీ రాజ్యాంగ పదవుల్లో ఉన్న అధికారులు లేఖ రాశారు. ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థ వంటి రాజ్యాంగ సంస్థలపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. 'ఓట్ చోరీ' ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలన్న మాజీ న్యాయమూర్తులు.. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (SIR) చట్టపరమైన నిబంధనల ప్రకారమే జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీలు తమ అభ్యంతరాలను మీడియా వేదికల కంటే చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని లేఖలో మాజీ న్యాయమూర్తులు పేర్కొన్నారు. కాగా, 'సర్'పై దేశ రాజధానిలో ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్న వేళ.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ భద్రతను మరింత పెంచారు. ఆయనకు ఇప్పటికే జెడ్ ప్లస్ భద్రత అందించగా, ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనలను దృష్టిలో పెట్టుకుని ఆయన నివాసం వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించారు. ఢిల్లీ పోలీసులు అందించిన సమాచారం ప్రకారం జ్ఞానేశ్ కుమార్‌కు ముప్పు ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో ఆయన నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీలో ఇప్పటికే నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని భద్రతా విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశాలు జారీ చేశారు.



# సర్'తో దేశాన్ని హైజాక్ చేస్తున్నారు

- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు పట్టు
- రాజ్‌ఘాట్ వద్ద ప్రతిపక్షాల సత్యాగ్రహం
- మూడో రోజుకు చేరిన విపక్షాల ఆందోళన
- దాదాపు 300 మంది ఎంపీల మద్దతు
- సత్యాగ్రహంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చిన బీజేపీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:**

దేశంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకత, ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల సంఘం స్వతంత్రతపై నెలకొన్న వివాదం నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి గురువారం దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆందోళనలను మరింత ఉధృతం చేసింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రతిపక్ష ఎంపీలు మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్‌ను శాంతియుత నిరసనకు వేదికగా ఎంచుకున్నారు. వరుసగా మూడో రోజు కొనసాగిన ఈ ఉద్యమంలో దాదాపు 300 మంది ఎంపీలు భాగస్వాములయ్యారని ప్రతిపక్ష నేతలు పేర్కొన్నారు. అయితే రాజ్‌ఘాట్ వద్ద ప్రత్యక్షంగా హాజరైన ఎంపీల సంఖ్యను స్వతంత్రంగా నిర్ధారించాల్సి ఉంది. గత రెండు రోజులుగా పార్లమెంట్ స్ట్రీట్, ఆకాశవాణి భవన్, జంతర్‌మంతర్ ప్రాంతాల్లో నిరసనలు నిర్వహించడానికి ప్రయత్నించిన ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అడ్డుకోవడం, పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడంతో రాజకీయ ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో గురువారం మహాత్మా గాంధీ సమాధి వద్ద సత్యాగ్రహం చేపట్టాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. గత రెండు రోజుల మాదిరిగా కాక గురువారం రాజ్‌ఘాట్ వద్ద పరిమితులతో కూడిన నిరసనకు పోలీసులు అవకాశం కల్పించారు.

**ప్రతిపక్ష ఎంపీల భోజన సమావేశం**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం మధ్యాహ్నం కన్నాట్ ప్లేస్‌లోని ఒక రెస్టారెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలకు ఏర్పాటు చేసిన భోజన సమావేశంలో తదుపరి ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ తదితర నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం ప్రతిపక్ష నాయకులు ప్రత్యేక బస్సుల్లో రాజ్‌ఘాట్‌కు బయలుదేరారు. అక్కడ గాంధీజీ స్మారక ప్రదేశం వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేయాలని నిర్ణయించారు. పెద్ద సంఖ్యలో ఎంపీలు, కాంగ్రెస్ కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి మద్దతుగా తరలివచ్చారు. ప్రతిపక్ష ఆందోళనల సందర్భంగా రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కలిసి దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. దేశ రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తూ ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో జరుగుతున్నాయని తాము ఆరోపిస్తున్న అక్రమాలపై బాధ్యులు సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. దాదాపు 300 మంది ఎంపీలు శాంతియుతంగా తమ నిరసన తెలియజేయడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ పదేపదే అడ్డుకుంటున్నారని రాహుల్ పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులపై బలప్రయోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలను పోలీసులు అంగీకరించడం లేదు. రాజ్‌ఘాట్‌కు చేరుకున్న ప్రతిపక్ష ఎంపీలు మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. అక్కడ దాదాపు గంటపాటు గడిపిన అనంతరం నేతలు వెనుదిరిగారు. అంతకుముందు రాజ్‌ఘాట్ ప్రాంతంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద ఆంక్షలు విధించిన ఢిల్లీ పోలీసులు, చివరకు నేతల నిరసనకు పరిమితంగా అనుమతించారు. పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందిని భారీగా మోహరించారు. రాజ్‌ఘాట్‌కు వెళ్లే మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, డ్రోన్ల ద్వారా పరిస్థితిని పర్యవేక్షించారు. స్మారక ప్రాంగణంలో నినాదాలు, బైఠాయింపులపై పరిమితులు విధించారు. గురువారం జరిగిన ప్రతిపక్షాల కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కూడా పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, కాంగ్రెస్ నాయకులు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, మాణిక్కం ఠాగూర్, వివేక్ తంఖా, జ్యోతిమణి, రాజీవ్ శుక్లా, దీపేందర్ హుడా తదితరులు హాజరయ్యారు. తృణమూల్ కాంగ్రెస్ నుంచి అభిషేక్ బెనర్జీ, మేనకా గురుస్వామి, సమీరుల్ ఇస్లాం, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రాజీవ్ రాయ్, మొహిబుల్లా, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్, సీపీఐ నేత పి. సంతోష్, ఆర్జేడీ నేత సుధాకర్ సింగ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. అయితే ప్రతిపక్ష కూటమిలోని అన్ని పార్టీలు సమాన స్థాయిలో పాల్గొనడం లేదు. డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ ఈ మూడు రోజుల నిరసనలకు దూరంగా ఉండగా, సమాజ్‌వాదీ పార్టీ కొన్ని కార్యక్రమాల్లో పాల్గొని మరికొన్నింటికి హాజరుకాలేదు.

**అసలు వివాదం ఏమిటి?**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ) ఈ ఉద్యమానికి ప్రధాన నేపథ్యంగా మారింది. ఈ ప్రక్రియలో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించారని, అర్హులైన పౌరుల ఓటు హక్కుకు భంగం కలుగుతోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఓటర్ల జాబితాల్లో అవకతవకలకు ఎన్నికల సంఘం చర్యలు దోహదపడుతున్నాయని, అవి అధికార బీజేపీకి రాజకీయ ప్రయోజనం కలిగించేలా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. అయితే ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను ఖండిస్తూ, మరణించినవారు, వేరే ప్రాంతాలకు వెళ్లినవారు, నకిలీ లేదా అనర్హమైన నమోదులను తొలగించేందుకే సవరణ చేపట్టినట్లు వివరిస్తోంది. ప్రతిపక్షాల రాజకీయ పక్షపాత ఆరోపణలను బీజేపీ కూడా తిరస్కరించింది.

**జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాల్సిందే: సీపీఎం**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు నిరసనలు కొనసాగిస్తామని సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ ప్రకటించారు. శుక్రవారం కూడా ఆందోళన కొనసాగుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయిల్లో నిరసనలకు పిలుపునిచ్చింది. తెలంగాణలో కూడా ఉద్యమానికి మద్దతు వ్యక్తమవుతోంది. సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, ఆయన సతీమణి నిర్మల బుధవారం రాత్రి నుంచి నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా, ప్రజల ఓటు హక్కు పరిరక్షణను వారు ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్నారు.

**బీజేపీ ప్రతిస్పందన**

ప్రతిపక్షాల ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఎన్నికల సంఘంపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు లేవని, రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ ఉద్యమాలు నిర్వహిస్తోందని బీజేపీ ప్రతినిధులు విమర్శించారు. ప్రతిపక్షాల నిరసనలు అరాచక పరిస్థితులను సృష్టించే ప్రయత్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసులు కూడా తమ చర్యలను సమర్థించుకున్నారు. అనుమతులు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన నిబంధనల ప్రకారమే నిరసన ప్రదర్శనలను నియంత్రించినట్లు తెలిపారు.

**ఎన్నికల సంఘం వివరణ**

అక్టోబర్ 6న దాదాపు 300 మంది ఎంపీలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కలవడానికి ప్రయత్నించగా అనుమతి నిరాకరించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే అదే రోజు సాయంత్రం నాలుగు గంటల వరకు రాజకీయ పార్టీల అధికార ప్రతినిధుల ద్వారా ఎలాంటి అధికారిక అపాయింట్‌మెంట్ అభ్యర్థన అందలేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. 2025లో అమల్లోకి తెచ్చిన విధానం ప్రకారం, రాజకీయ పార్టీలు అధీకృత ప్రతినిధుల ద్వారా ముందస్తుగా అపాయింట్‌మెంట్ కోరాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ విషయంలో కాంగ్రెస్, ఎన్నికల సంఘం మధ్య భిన్నమైన వాదనలు కొనసాగుతున్నాయి.

**మూడు రోజులుగా కొనసాగుతున్న ఆందోళన**

ఈనెల 6న పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు ప్రతిపక్ష ఎంపీలు చేపట్టిన ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి ప్రవేశించి గంటల తరబడి బైఠాయించారు. చివరకు వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతరం విడుదల చేశారు. 7న జంతర్‌మంతర్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన ప్రతిపక్ష నాయకులను విండ్సర్ ప్లేస్ సమీపంలో పోలీసులు నిలువరించారు. అక్కడ జరిగిన నిరసనల్లో ప్రియాంక గాంధీ రాజ్యాంగ ప్రతిని చేతబట్టుకుని రోడ్డుపై బైఠాయించారు. రాహుల్ గాంధీ సహా పలువురిని మరోసారి అదుపులోకి తీసుకున్నారు. అక్టోబర్ 8న మాత్రం గాంధీజీ సమాధి వద్ద నిరసన నిర్వహించడం ద్వారా ఉద్యమాన్ని కొనసాగించారు. ఈ మూడు రోజుల పరిణామాలతో ఎన్నికల సంఘం పనితీరు, రాజకీయ పార్టీల నిరసన హక్కు, ప్రజాప్రతినిధులపై పోలీసు చర్యలు జాతీయస్థాయి చర్చనీయాంశాలుగా మారాయి. ఎన్నికల జాబితాల సవరణ, ఎన్నికల సంఘం నిర్ణయాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న ఈ వివాదం మరింత తీవ్రమవుతోంది. రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతను, ఓటు హక్కును పరిరక్షించడమే తమ ఉద్యమ లక్ష్యమని ప్రతిపక్షాలు చెబుతుండగా, ఎన్నికల ప్రక్రియపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అధికారపక్షం విమర్శిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా డిమాండ్‌తో ప్రారంభమైన నిరసనలు రాబోయే రోజుల్లోనూ కొనసాగనున్నాయి.

# టెలికాం రంగం సుపరిపాలనకు కీలకం: మోదీ

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 8:**

దేశంలో టెలికాం రంగం, మొబైల్ ఫోన్లు కేవలం నెట్‌వర్క్, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు వేగంగా అందించడంతో పాటు సుపరిపాలనకు అవి కీలక సాధనాలుగా మారాయని పేర్కొన్నారు. ఢిల్లీలోని యశోభూమిలో ప్రారంభమైన 10వ ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ఆయన ప్రసంగించారు. వందలాది ప్రభుత్వ సేవలు ప్రస్తుతం మొబైల్ ఫోన్ల ద్వారా అందుబాటులోకి వచ్చాయని మోదీ తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు లబ్ధిదారుల మొబైల్ నంబర్లతో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలకు నేరుగా చేరుతున్నాయని చెప్పారు. డిజిటల్ కనెక్టివిటీ విద్యారంగానికి కూడా కొత్త అవకాశాలను తీసుకొచ్చిందన్నారు.

**5జీతో వేగంగా విస్తరించిన కనెక్టివిటీ**

టెలికాం, డిజిటల్ టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఫోన్, నెట్‌వర్క్ భద్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని మోదీ అన్నారు. 2022లో ఇదే వేదిక నుంచి దేశంలో 5జీ సేవలను ప్రారంభించామని, ప్రస్తుతం ప్రతి జిల్లాకూ 5జీ నెట్‌వర్క్ విస్తరించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 5.5 లక్షలకు పైగా బేస్ స్టేషన్లు పనిచేస్తున్నాయని, 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం పదింతలు పెరిగిందని వెల్లడించారు. గత పదేళ్లలో మారుమూల ప్రాంతాలకు మొబైల్ టవర్లు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణతో టెలికాం మౌలిక వసతులు బలోపేతమయ్యాయని చెప్పారు. అందుబాటులోకి వచ్చిన డేటా ధరలతో టెక్నాలజీ, వినోదం, విద్య వంటి రంగాల్లో వినియోగం పెరిగిందని, కొత్త తరం కంటెంట్ క్రియేటర్లకు కూడా అవకాశాలు విస్తరించాయని పేర్కొన్నారు.

**డీబీటీతో రూ.50 లక్షల కోట్ల బదిలీ**

డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి ఇప్పటివరకు రూ.50 లక్షల కోట్ల నిధులు చేరాయని మోదీ తెలిపారు. ఈ విధానం ద్వారా దాదాపు రూ.5 లక్షల కోట్లు ఆదా చేయగలిగామని చెప్పారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గిందని, ప్రయాణం, నిరీక్షణ, ఖర్చు తగ్గడంతో సేవలు మరింత సులభంగా అందుతున్నాయని వివరించారు.



పీఎంకిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతుల ఖాతాల్లోకి ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్లకు పైగా నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి నిధులు బదిలీ అవుతున్నాయని, నగదు జమ అయిన వెంటనే రైతుల మొబైల్ ఫోన్లకు సమాచారం అందుతోందన్నారు.

**గేమింగ్‌కు కేంద్రంగా మొబైల్ ఫోన్**

దేశంలో 50 కోట్ల మందికి పైగా ప్రజలు ఏదో ఒక రూపంలో గేమింగ్‌తో అనుసంధానమై ఉన్నారని మోదీ చెప్పారు. ముఖ్యంగా టైర్2, టైర్3 నగరాల్లోని యువత గేమింగ్, ఈస్పోర్ట్స్, గేమింగ్ కంటెంట్, కొత్త వ్యాపారాల్లో భాగస్వాములవుతున్నారని తెలిపారు. మొబైల్ ఫోన్ కేవలం గేమింగ్ కన్సోల్‌గా కాకుండా కంటెంట్ సృష్టించే స్టూడియోగా కూడా మారిందని మోదీ పేర్కొన్నారు.

# భవిష్యత్తులో మూడే రకాల ఉద్యోగాలు..'

**వెబ్ డెస్క్ :**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, భవిష్యత్తులో ఉపాధి రంగంపై దాని ప్రభావం ఏ విధంగా ఉంటుందో కచ్చితంగా అంచనా వేయడం కష్టమని ప్రముఖ టెక్ నిపుణురాలు క్లారా షి పేర్కొన్నారు. గతంలో సేల్స్‌ఫోర్స్, మెటా వంటి దిగ్గజ సంస్థల్లో ఏఐ విభాగాధిపతిగా పనిచేసిన ఆమె, సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక విషయాలను వెల్లడించారు. భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా కేవలం మూడే రకాల ఉద్యోగాలు ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఏఐని రూపొందించేవారు, ఏఐని వినియోగించేవారు, ఏఐ పర్యవేక్షణలో పనిచేసేవారు అని వివరించారు.



ఇప్పటికే మూడో వర్గానికి చెందిన ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయని, ఉబెర్ డ్రైవర్లు, డోర్‌డాష్ డెలివరీ సిబ్బంది, కస్టమర్ సపోర్ట్ ప్రతినిధులు వంటి వారు ఈ జాబితాలోకి వస్తారని ఆమె తెలిపారు. వీరి పనితీరును ఏఐ నిరంతరం పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు. అధిక శాతం మంది తాము ఏఐని ఉపయోగించే రెండో కేటగిరీలోకి వస్తామని భావిస్తున్నప్పటికీ, ఆ సమూహం అంచనా వేసిన దానికంటే చాలా చిన్నదని, భవిష్యత్తులో అది మరింత కుంచించుకుపోతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

ఏఐ ఆవిర్భావంతో యువత, ముఖ్యంగా నూతన గ్రాడ్యుయేట్ల ఉపాధి అవకాశాలు ప్రమాదంలో పడుతున్నాయని క్లారా షి ఆందోళన వ్యక్తం చేశారు. తాను గతంలో పనిచేసిన సంస్థల్లోనూ ఎంట్రీలెవల్ ఉద్యోగాల నియామకాలు తగ్గడాన్ని గమనించినట్లు ఆమె వెల్లడించారు. అమెరికాలో ఇటీవల కాలేజీ విద్య పూర్తి చేసిన ప్రతి ఇద్దరిలో ఒకరు నిరుద్యోగిగా ఉండటం లేదా తమ విద్యార్హతకు సంబంధం లేని పనుల్లో కొనసాగుతుండటమే ఇందుకు నిదర్శనమని ఆమె గణాంకాలను ఉటంకించారు. నూతనంగా విధుల్లోకి చేరే అభ్యర్థుల కంటే ఏఐ ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుండటంతో, కంపెనీలు తమ నియామక ప్రక్రియల్లో భారీ మార్పులు చేస్తున్నాయని వివరించారు.

"సకాలంలో తగిన చర్యలు తీసుకోకపోతే, ఒకప్పుడు తయారీ రంగం ఏ విధమైన సంక్షోభాన్ని ఎదుర్కొందో, అదే పరిస్థితి ఇప్పుడు అమెరికాలోని ప్రతి ప్రధాన నగరంలోనూ పునరావృతమవుతుంది" అని ఆమె హెచ్చరించారు. ఈ మార్పులు అత్యంత వేగంగా సంభవిస్తున్నాయని, మారుతున్న పరిస్థితుల్లోకు అనుగుణంగా యువతకు దిశానిర్దేశం చేసేందుకు తాను 'న్యూ వర్క్ ఫౌండేషన్' అనే లాభాపేక్ష లేని సంస్థను స్థాపించినట్లు క్లారా షి తెలిపారు.

# నేలకొండపల్లి మండలంలో కలుషితమవుతున్న స్వచ్ఛమైన నీరు లాభాల వెనుక ప్రజారోగ్యం బలి!

**ఖమ్మం రాజముద్ర న్యూస్:**



నేలకొండపల్లి: ఒకప్పుడు కుండలోని నీరు, బావి నీరు తాగిన గ్రామం ఇది. ఇప్పుడు ప్రతి ఇంట్లో 20 లీటర్ల వాటర్ క్యాన్. తాగునీరు వ్యాపారం కాదు, నమ్మకం. కానీ నేలకొండపల్లి మండలంలో ఆ నమ్మకాన్నే కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 20కి పైగా ఆర్ ఓ వాటర్ ప్లాంట్లు ఎలాంటి నిబంధనలు పాటించకుండా నడుస్తున్నాయనేది క్షేత్రస్థాయి పరిశీలనలో బయటపడుతున్న చేదు నిజం.

**ఎందుకు ఇంతలా వెలిశాయి?**
మిషన్ భగీరథ నీరు వస్తున్నా, ప్రజల్లో ఫ్లోరైడ్, ఉప్పు నీటి భయం ఉంది. ఈ భయమే వ్యాపారంగా మారింది. కేవలం రూ.60 వేల నుండి లక్ష రూపాయలతో చైనా ఆర్ ఓ మెషిన్, రెండు మోటార్లు పెడితే ప్లాంట్ రెడీ. రోజుకు 100 క్యాన్లు అమ్మితే రూ.2000 నుండి రూ.3000 లాభం. ఈ లాభమే అర్హత లేనివారిని కూడా ఈ వ్యాపారంలోకి లాగుతోంది.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి? జరుగుతున్నది ఏమిటి?**
చట్ట ప్రకారం ఒక వాటర్ ప్లాంట్ కు 7 రకాల అనుమతులు తప్పనిసరి. కానీ మండలంలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం.

**చట్టం ప్రకారం ఉండాల్సింది**
**FSSAI లైసెన్స్:** ఆహార భద్రతా ప్రమాణాల లైసెన్స్ లేకుండా నీరు అమ్మడం నేరం. 7 సంవత్సరాల జైలు శిక్ష కూడా ఉంది.
**BIS (ఐఎస్ఐ - ఐఎస్ 14543):** ఇది లేకుండా "ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్" అని అమ్మకూడదు.
**టిఎస్ పి సిబి అనుమతి:** వాడిన కెమికల్స్, వ్యర్థ జలాల వదిలివేతకు కాలుష్య నియంత్రణ మండలి అనుమతి.
**గ్రౌండ్ వాటర్ ఎన్ ఓ సి:** రోజుకు వేల లీటర్లు తోడేస్తున్నారు. దీనికి గ్రౌండ్ వాటర్ శాఖ అనుమతి కావాలి.

**క్షేత్రస్థాయిలో జరుగుతున్నది:**
మండలంలో 80% ప్లాంట్లకు FSSAI లైసెన్స్ కూడా లేదు. ఐఎస్ఐ మార్క్ అసలే లేదు. క్యాన్లపై ఎలాంటి బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, ఎక్స్రే తేదీ ఉండదు. ఫిల్టర్లు ఎప్పుడు మార్చారో రికార్డు లేదు. ల్యాబ్ టెస్ట్ రిపోర్ట్ అడిగితే బిక్కమొహం వేస్తున్నారు.

**ప్రజారోగ్యంపై దీర్ఘకాలిక దెబ్బ**
శుద్ధి చేయని లేదా సరిగా శుద్ధి చేయని నీటిని తాగడం వల్ల తక్షణమే టైఫాయిడ్, డయేరియా, కామెర్లు వచ్చే ప్రమాదం ఉంది. అంతకంటే భయంకరమైన విషయం ఏమిటంటే, ఆర్ ఓ మెషిన్ సరిగా మెయింటెన్ చేయకపోతే, ఫిల్టర్లలో బ్యాక్టీరియా పెరిగి అదే నీటిని మరింత కలుషితం చేస్తుంది. టిడిఎస్ పేరుతో మొత్తం మినరల్స్ తీసేసి చప్పిడి నీరు ఇస్తే, దీర్ఘకాలంలో ఎముకల బలహీనత, గుండె జబ్బులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**వ్యవస్థ వైఫల్యం ఎక్కడ?**
ఈ ప్లాంట్లను తనిఖీ చేయాల్సిన బాధ్యత ముగ్గురిది. పంచాయతీ కార్యదర్శి: ట్రేడ్ లైసెన్స్ ఇచ్చేటప్పుడే FSSAI ఉందా లేదా చూడాలి.
ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్: నెలకు ఒకసారి తనిఖీ చేయాలి. డి ఎం హచ్ ఓ / టి ఎస్ పిసిబి: ఫిర్యాదు వస్తే సీజ్ చేయాలి.
కానీ ఫిర్యాదులు లేవనే సాకుతో ఎవరూ గ్రామాల్లోకి రావడం లేదు. దీంతో అక్రమ ప్లాంట్లు రెచ్చిపోతున్నాయి.

**పరిష్కారం ఏమిటి?**
ప్రభుత్వం వెంటనే నేలకొండపల్లి మండలంలో "వాటర్ ప్లాంట్లపై స్పెషల్ డ్రైవ్" నిర్వహించాలి.
మండలంలోని అన్ని ప్లాంట్ల వివరాలతో కలెక్టర్ కు నివేదిక ఇవ్వాలి.
అనుమతి లేని ప్లాంట్లను సీజ్ చేసి, యజమానులపై FSSAI చట్టం కింద కేసు నమోదు చేయాలి.
అనుమతి ఉన్న ప్లాంట్ల జాబితాను, వాటి వాటర్ టెస్ట్ రిపోర్టులను మండల కార్యాలయంలో, ప్రతి గ్రామ పంచాయతీలో ప్రదర్శించాలి.ప్రజలు కూడా క్యాన్ కొనేటప్పుడు FSSAI నంబర్, ఐఎస్ఐ మార్క్, తయారీ తేదీ ఉందో లేదో చూసి కొనాలి. నీరు అందరి హక్కు. దాన్ని వ్యాపారం పేరుతో కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదు. అధికారులు ఇప్పటికైనా మేల్కొనకపోతే, రేపు జరిగే ఆరోగ్య విపత్తుకు బాధ్యత ఎవరిది?

# చేవెళ్ల పరిధి కాందవాడ డంపింగ్ యార్డులో వ్యక్తి దారుణ హత్య...

- మొబైల్ ఫోన్ చోరీ విషయంలో గొడవ...
- దాడి చేసి హత్య చేసినట్లు నిందితుడి స్వచ్ఛంద వాంగ్మూలం



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** మొబైల్ ఫోన్ చోరీ విషయంలో గొడవ జరిగి వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం (07.10.2026) రోజు రాత్రి సుమారు 23:00 నుండి 23:30 గంటల మధ్య, చేవెళ్ల మండలం కందవాడ గ్రామ పరిధిలోని డంపింగ్ యార్డు వద్ద ఒక వ్యక్తిపై దాడి చేసి హత్య చేయడం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి 08.10.2026 నాడు సుమారు 13:20 గంటలకు, ఒక వ్యక్తి స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట హాజరై, సంఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించాడు. ప్రాథమిక విచారణలో తెలిసిన వివరాల ప్రకారం, సంబంధిత వ్యక్తులు చేవెళ్ల బస్టాండ్ వద్ద ఉన్న సమయంలో సుమారు 40–45 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను చోరీ చేసినట్లు తెలుస్తోంది. అనంతరం మొబైల్ ఫోన్‌ను తిరిగి ఇవ్వాలని బాధితుడు డిమాండ్ చేయడంతో, విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించడంతో అతడిని మభ్యపెట్టి కందవాడ డంపింగ్ యార్డు వద్దకు తీసుకెళ్లినట్లు వెల్లడైంది. అక్కడ ఒక షెడ్‌లోకి తీసుకెళ్లి మొబైల్ ఫోన్ పాస్‌వర్డ్ చెప్పాలని బాధితుడిపై ఒత్తిడి చేసినట్లు, బాధితుడు పాస్‌వర్డ్ చెప్పడానికి నిరాకరించడంతో మొదట చేతులతో, అనంతరం చెక్క కర్రలతో దాడి చేసినట్లు నిందితుడి వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఈ దాడిలో బాధితుడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అతను మృతి చెందినట్లు వెల్లడైంది. అనంతరం సంఘటనకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేయాలనే ఉద్దేశంతో బాధితుడి మొబైల్ ఫోన్‌ను డంపింగ్ యార్డులో మండుతున్న (కాలుతున్న) ప్రదేశంలో పడవేసినట్లు కూడా వెల్లడైంది. ఈ సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సంబంధిత ఆధారాలను సేకరించేందుకు చర్యలు చేపట్టారు. మృతుడి గుర్తింపు, సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నిందితుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టి, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

**పెండింగ్ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి: టీజేఏ డిమాండ్**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఖమ్మంలో జర్నలిస్టులకు కేటాయించిన 23 ఎకరాల భూమిని అర్హులైన జర్నలిస్టులకు వెంటనే పంపిణీ చేయాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టి జె ఎ) ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.ఈ మేరకు పెండింగ్ లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డికి టీజేఏ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జర్నలిస్టులు ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గతంలో కేటాయించిన 23 ఎకరాల భూమి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయడం వల్ల జర్నలిస్టులు తమ వృత్తిపరమైన విధులను మరింత సౌకర్యవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈఓను టీజేఏ యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించి, జర్నలిస్టుల పిల్లలకు విద్యలో 50 శాతం రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీజేఏ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జి. నాగస్వామి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు శంకువార్ ప్రశాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖాసిం, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎం.డి. రషీద్, జిల్లా నాయకులు వాసం రాజేంద్ర ప్రసాద్, నల్లమోతు శ్రీనివాసరావు, పవన్ కుమార్, వంశీ, వేంపటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బచ్చోడు గ్రామంలో బ్యాంకు ఏర్పాటు చేయాలి

**ఆర్బీఐ గవర్నర్ కు సర్పంచుల వినతి**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** బచ్చోడు గ్రామంలో ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్బీఐ గవర్నర్ కు తిరుమలాయపాలెం మండలం బచ్చోడు ప్రాంత గ్రామ ప్రజాప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బ్యాంకింగ్ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో ముఖ్యంగా రైతులు, మహిళలు, వృద్ధులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.బచ్చోడు గ్రామంలో పెద్ద సంఖ్యలో ప్రజలు నివసిస్తున్నారని, పరిసర గ్రామాలకు ఇది ప్రధాన కేంద్రంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లావాదేవీలు, రైతుల అవసరాలు, పొదుపు ఖాతాలు, రుణాలు, పింఛన్ల కోసం ప్రజలు ఇతర ప్రాంతాల బ్యాంకులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు.బచ్చోడులో బ్యాంకు శాఖ ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు రైతులు, మహిళా సంఘాలు, చిరు వ్యాపారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా బ్యాంకు ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆర్బీఐ గవర్నర్ ను కోరారు. గురువారం ఆర్బీఐ సహాయ అధికారి ఈ. శోభారాణిని కలిసిన వారిలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బండెల వెంకయ్య, నాయకులు రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, రెంటాల యాదగిరి, ఎస్.కె. సర్దార్, బయ్య శ్రీను, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# అతివేగంగా, అధిక శబ్దంతో బైక్ నడుపుతున్న యువకుడిపై కేసు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి సెంటర్ లో పెట్రోలింగ్ చేస్తుండగా కుసుమంచి రోడ్డు వైపు నుండి ఒక మోటార్ సైకిల్ ను అతివేగంగా, అజాగ్రత్తగా, అధిక శబ్దం చేస్తూ ప్రజలకు హాని కలిగించే విధంగా నడుపుతూ వస్తుండగా పోలీసులు గుర్తించారు. బైక్ నడుపుతున్న వ్యక్తిని చెంగాపొంగు ప్రవీణ్, అమ్మపేట గ్రామం, ముదిగొండ మండలం వాసిగా గుర్తించి, అతని మోటార్ సైకిల్ ను సీజ్ చేసిన నేలకొండపల్లి ఎస్ఐ పి. శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, మండల ప్రజలు ఎవరైనా తమ వాహనాలను అధిక వేగంగా, అజాగ్రత్తగా, అధిక శబ్దం చేస్తూ ప్రజలకు హాని కలిగించేలా నడిపితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.అధిక శబ్దం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఎవరైనా వాహనాలు నడిపితే వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు.

# దినకర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఉప్పల్ వాయి గ్రామంలో మాజీ రైతుబంధు మండల అధ్యక్షులు గురజాల నారాయణరెడ్డి తల్లి నరసవ్వ ఇటీవల మరణించినందున గురువారం రోజున దినకర్మ కు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరై పూల గుచ్చాల వేసి నివాళులర్పించారు, ఆమె ఆత్మ శాంతించాలని ప్రార్థించారు, అలాగే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు, జాజాల సురేందర్ వెంట మాజీ జెడ్పిటిసి రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి, శీను నాయక్, లింబాద్రి నాయక్, కొత్తల గంగారం, పర్వ రెడ్డి, గ్రామ బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కాలభైరవస్వామి ఆలయంలో వేలం నిర్వహణ



**రామారెడ్డి ,రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఇసన్నపల్లి (రామారెడ్డి) శ్రీ కాలభైరవస్వామి వెలసిన దేవస్థానం దుకాణాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. కిరాణా, పూసల దండలు, బుక్ స్టాల్, కొబ్బరికాయ, కూల్ డ్రింక్స్ దుకాణాలకు 6 మంది డిపాజిట్లు చెల్లించగా, 5 మంది మధ్య పోటీ నెలకొంది. చివరకు రామారెడ్డికి చెందిన పూసల స్వరూప తండ్రి లింబాద్రి రూ.8,15,000లకు ఏడాదికి దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ పరిశీలకులు సత్యనారాయణ,ఈవో ప్రభురామచంద్రం,చైర్మన్ చింతల శంకర్, కమిటీ సభ్యులు,సర్పంచులు లచ్చయ్య, బండి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నాటుసారా తయారీపై ఎక్సైజ్ శాఖ దాడులు



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు, కామారెడ్డి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోశెట్టి ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు గురువారం రామారెడ్డి మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక దాడులు, తనిఖీలు నిర్వహించారు. కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కన్నాపూర్ తండా, దుబ్బ తండా, స్కూల్ తండా, జగదాంబ తండా, బట్టు తండా తదితర ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో కన్నెగూడెం తండా శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 40 లీటర్ల బెల్లం పానకం తయారీకి వినియోగించే ఎఫ్‌జే వాష్‌ను గుర్తించి, అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి రెండు కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అదేవిధంగా, పరిధిలోని కల్లు దుకాణాలను తనిఖీ చేసి, నాణ్యతా పరీక్షల నిమిత్తం కల్లు నమూనాలను సేకరించారు. అడ్లూర్ టీసీఎస్ డిపో, దేవునిపల్లి టీఎఫ్‌టీ దుకాణం నంబర్–4, అన్నారం టీఎఫ్‌టీ దుకాణం నంబర్–1 వద్ద కల్లు నమూనాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు. అక్రమ నాటుసారా తయారీ, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో అక్రమ మద్యం కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ ప్రత్యేక తనిఖీలు, దాడులు నిర్వహిస్తామని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.

## నాన్ వెజ్ వ్యర్థాల సేకరణకు వేలం నిర్వహణ

**మున్సిపల్ కమిషనర్ ముత్యాలు**



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో నాన్ వెజ్ వ్యర్థాల సేకరణకు మున్సిపల్ అధికారులు టెండర్లను ఆహ్వానించారు. వివిధ ప్రాంతాల నుంచి 9 సంస్థలు దరఖాస్తు చేయగా, గురువారం మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, టెండర్ నిర్వాహకుల సమక్షంలో టెండర్లను ఓపెన్ చేశారు.9 సంస్థల్లో ఇద్దరు ప్రతినిధులు గైర్హాజరయ్యారు. కనకదుర్గ ఎంటర్ ప్రైజెస్ డిడి సమర్పించకపోవడంతో వారి టెండర్ ను రిజెక్ట్ చేశారు. మిగిలిన 8 సంస్థల టెండర్లను ఓపెన్ చేశారు. అత్యధిక హైదరాబాద్ కు చెందిన షా ఎంటర్ ప్రైజెస్ 2 లక్షల 34 వేల రూపాయలు వేయడంతో వారికి టెండర్ దక్కింది. ఇతర సంస్థలలో మైనే ఫుడ్ అండ్ సీడ్స్ లక్ష 85 వేలు, ఆజాల్ ట్రేడర్స్ లక్ష 65 వేల రూపాయలు మహబూబా ఎంటర్ ప్రైజెస్ లక్ష 80 వేలు తాజ్ ఎంటర్ ప్రైజెస్ లక్ష 72 వేలు ఎస్ కేపీ ట్రేడర్స్ లక్ష 55 వేలు మనం ఎంటర్ ప్రైజెస్ 1లక్ష 80 వేలు టెండర్ దాఖలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పర్వతాలు మాట్లాడుతూ టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని, మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాలను సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ హన్మంత్ రావు, టీపీఓ వినీత్ పాల్గొన్నారు.

## విద్యా భారతి సంస్థకు జాతీయ స్థాయి అవార్డు




**రాజముద్ర న్యూస్, తాండూర్:** హైదరాబాద్ లో జరిగిన సౌత్ ఇండియా ఎడ్యుకేషన్ సమ్మిట్-2026లో తమ సంస్థ విద్యా భారతి హైస్కూల్ కు జాతీయ స్థాయిలో డైనమిక్ స్కూల్ అవార్డు లభించిందని పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బోధన అంశాల్లో విభిన్నత అంశంలో పాఠశాలకు ఈ అవార్డు లభించినట్లు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో జి న్యూస్ నెట్ వర్క్ సీఈఓ అనిల్ శర్మ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం సంస్థ పనితీరుకు గర్వకారణమని అన్నారు. అవార్డు ప్రదానంలో అకాడమిక్ డైరెక్టర్ సురభి సౌమ్య రావు పాల్గొన్నారు. సంస్థ చైర్మన్ సురభి ఆగమారావు సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది అంకితభావంతో చేసిన కృషితో ఈ అవార్డు వచ్చిందని సిబ్బందిని అభినందించారు.

## నీలాయపల్లిలో దోమల మందు పిచికారీ

**రాజముద్ర న్యూస్, తాండూర్:** మండలంలోని నీలాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు ఇంటింటికీ తిరిగి దోమల మందు పిచికారీ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోలవేణి తిరుపతి మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలే మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువ రోజులు నిల్వ ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. అపరిశుభ్రత, నిల్వ నీరు దోమల వృద్ధికి కారణమవుతాయని, వాటి ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వివరించారు. జ్వరం వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని సరైన చికిత్స పొందాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఏఎన్ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, బ్రీడింగ్ చెకర్ కిరణ్, ఆశా కార్యకర్త కవిత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో మెరిసిన ఉస్మాన్స్ కేరళ గ్రామర్ పాఠశాల పూర్వ విద్యార్థి

**ఎంబీబీఎస్ సీటు సాధించిన చోలే నరేష్కు ఘన సన్మానం**

**రాజముద్ర న్యూస్, జైనూర్:** జైనూర్ మండల కేంద్రంలోని ఉస్మాన్స్ కేరళ గ్రామర్ స్కూల్ పూర్వ విద్యార్థి చోలే నరేష్ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ జమీల్, ఉపాధ్యాయులు గురువారం నరేష్ను అభినందించారు. ఆయన సాధించిన విజయాన్ని పురస్కరించుకుని పాఠశాల యాజమాన్యం ఆయనతో పాటు తండ్రి చోలే మహాదేవ్ను శాలువాలతో ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ మాట్లాడుతూ భవిష్యత్తులో వైద్య రంగంలో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఎంబీబీఎస్ సీటు సాధించడం తమకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. నరేష్ పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. భవిష్యత్తులో వైద్యుడిగా రాణించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం

**ఆదిలాబాద్ లో భారీ నిరసన**



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** ఓటరు సవరణ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఇచ్చిన 'సేవ్ డెమోక్రసీ' పిలుపులో భాగంగా రాహుల్ గాంధీకి మద్దతుగా జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ, కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషనర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ చౌక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండేలా పారదర్శకతను నిర్ధారించాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందన్నారు. "ఓట్ చోరీ" ఆరోపణలపై సమగ్రంగా సమాధానాలు ఇవ్వాలని, ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపాడేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ ఇంచార్జ్ బెజ్జంకి అనిల్ కుమార్, కార్యాలయ ఇంచార్జ్ గౌలి సంజీవ్ కుమార్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ బండారి సతీష్, మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఎస్సీ విభాగం అధ్యక్షులు పరమేశ్వర్, మైనారిటీ విభాగం అధ్యక్షులు సయ్యద్ షాహిద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు జిశాన్, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు మోతిరాం, జనరల్ సెక్రటరీలు బండి దేవదాస్ చారి, అత్తర్ అలీ, మందాకిని, కాడె సంతోష్, సెక్రటరీ సిరాజుద్దీన్, మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, మావల మండల అధ్యక్షులు కుదురుపాక సురేష్, మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటో యూనియన్ నూతన ధరల పట్టిక ఆవిష్కరణ

**నేటి నుంచి కొత్త ఛార్జీలు అమలు**

**రాజముద్ర న్యూస్, తాండూర్:** పెరిగిన నిత్యావసర ధరలు, డీజిల్, గ్యాస్ ధరలను దృష్టిలో ఉంచుకుని తాండూర్ మండల ఆటో యూనియన్ నూతన ఛార్జీలను నిర్ణయించింది. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని ఐబీలో యూనియన్ నాయకులు, ఆటో కార్మికులు, ప్రజల సమక్షంలో ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సాలిగామ బానయ్య నూతన ధరల పట్టికను ఆవిష్కరించారు. కొత్త ధరలు గురువారం నుంచే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు సౌకర్యం కారణంగా ఆటో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెరిగిన ఇంధన ధరలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయించిన ఛార్జీలు న్యాయబద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కనీస ఛార్జీ రూ.20, ఎంవీకే-3కు రూ.30, బెల్లంపల్లికి రూ.30, మంచిర్యాలకు రూ.70గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆటో కార్మికులకు సహకరించాలని కోరారు. ఆటో కార్మికులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు, ఇన్సూరెన్స్, జీవిత బీమా తదితరాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. నూతన ఛార్జీలపై నిర్ణయం తీసుకునే ముందు బుధవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా, ఉపాధ్యక్షుడు చాంద్ ఖాన్, కోశాధికారులు రఫీ ఖాన్, అభి, మండల సలహాదారు విద్యాసాగర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రేగుల



రవి, ఆశుమ్ అలీ, సంయుక్త కార్యదర్శి పల్లె వెంకటేష్, గుమ్మడి పోషమల్లు, దండుగుల రమేష్, త్రిబుల్ ఆర్ రియాజ్, ఫయీమ్, డోలి శ్రీనివాస్, జిమిక్స్ రవి, శశి ఠాగూర్, కన్నయ్య, భీమ్రావు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల స్మశానవాటికకు మహర్దశ

- **ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం**

**రాజముద్ర న్యూస్, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలోని మైనార్టీల స్మశానవాటికకు ఎట్టకేలకు విద్యుత్ వెలుగులు రానున్నాయి. చాలాకాలంగా పెండింగ్లో ఉన్న విద్యుత్ సౌకర్యం సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానిక మైనార్టీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన స్తంభాలు, తీగలు, ట్రాన్స్ఫార్మర్కు సంబంధించిన వైర్లను మంజూరు చేసినట్లు మైనార్టీ నాయకులు తెలిపారు. మైనార్టీ యువకుల విజ్ఞప్తి మేరకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి అవసరమైన సామగ్రిని మంజూరు చేశారని పేర్కొన్నారు. స్మశానవాటికకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు చాలా కాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. త్వరలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఇతర పనులు పూర్తిచేసి వెలుగులు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్రెడ్డి ఆదేశాలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజారెడ్డి సహకారం, మాజీ సర్పంచ్ వీరస్వామి గౌడ్ కృషి కారణమని పేర్కొన్నారు. మాజీ ఏఈ విజయ్కుమార్, ప్రస్తుత ఏఈ రాఘవ, లక్ష్మీకాంత్రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆసీఫ్, ధనుంజయ్, మాజీ వార్డు సభ్యుడు ఖదీర్, మత పెద్ద ముఫ్తి అబ్దుల్ బారి, సీనియర్ నాయకులు ఇస్మాయిల్, అబ్దుల్ ఖదీర్, అజ్జు, ఆసీఫ్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బెజ్జూర్లో ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి

- **మలుపు వద్ద బైక్ అదుపుతప్పి ఘటన**





**రాజముద్ర న్యూస్, బెజ్జూర్:** ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బెజ్జూర్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రేచిని గ్రామానికి చెందిన నికురి అనంతరావు, నికురి మల్లయ్య, నికురి రాజయ్య ముగ్గురు ఒకే ద్విచక్ర వాహనంపై కాగజ్నగర్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా, సలగుపల్లి మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా, నికురి రాజయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరావు పరిస్థితి విషమంగా ఉండగా, మల్లయ్య కుడి చేయి విరిగినట్లు సమాచారం. క్షతగాత్రులను బెజ్జూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు 108 వాహనంలో కాగజ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బెజ్జూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మితిమీరిన వేగంతో పాటు మూలమలుపు వద్ద రహదారి సరిగా లేకపోవడం ప్రమాదానికి కారణమై ఉండొచ్చని స్థానికులు తెలిపారు.

# డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **సంప్రదాయ దుస్తుల్లో అలరించిన విద్యార్థినులు**

**రాజముద్ర న్యూస్, కాగజ్నగర్:** కాగజ్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత సెల్ సమన్వయంతో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ తరతరాలుగా కొనసాగుతున్న బతుకమ్మ పండుగ



సాంప్రదాయాలు తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమని అన్నారు. వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహం బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని, తెలంగాణ సంస్కృతిలో దాని విశిష్టతను వివరించారు. కళాశాల కోఆర్డినేటర్ దుర్గం జనార్దన్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రతిఒక్కరి జీవితాల్లో ఆనందం, సంతోషం నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తూడూరు దత్తాత్రేయ, మహిళా సాధికారత విభాగం ఇన్చార్జి రోజ్ మేరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరై అందంగా బతుకమ్మలను అలంకరించి, బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు భారీ క్రేజ్..

- ఏడాదికి ముందే లక్షకుపైగా దరఖాస్తులు..




ఐసీసీ పురుషుల వన్డే ప్రపంచకప్ 2027కు సంబంధించిన టికెట్ల వేటలో భారత్, పాకిస్థాన్ మ్యాచ్ సృష్టించిన క్రేజ్ మామూలుగా లేదు. అక్టోబర్ 1, 2026న టికెట్ బ్యాలెట్ ఓపెన్ అయినప్పటి నుంచి ఇప్పటివరకు ఏకంగా పది లక్షలకు పైగా టికెట్ దరఖాస్తులు రాగా, అందులో అక్టోబర్ 10న జరగనున్న ఇండియాపాకిస్థాన్ మ్యాచ్ కోసమే ఏకంగా లక్షకు పైగా అప్లికేషన్లు దాఖలయ్యాయి. మ్యాచ్‌కు ఇంకా ఏడాది సమయం ఉండగానే ఇంత క్రేజ్ రావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ 14వ ఎడిషన్ ప్రపంచకప్ టోర్నీ 2027 అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు జరగనుంది. ఇప్పటి వరకు దాదాపు 3,20,000 మందికి పైగా అభిమానులు ఈ మూడు దేశాల్లో జరిగే రకరకాల మ్యాచ్‌ల టికెట్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీన్నిబట్టి ఈ మెగా టోర్నీపై అభిమానుల్లో ఏ రేంజ్ అంచనాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. డిమాండ్ విషయంలో ఇండియాపాకిస్థాన్ మొదటి స్థానంలో ఉంటే, ఆ తర్వాతి స్థానాల్లోనూ టీమిండియా మ్యాచ్‌లే రాజ్యమేలుతున్నాయి. 86,000కు పైగా దరఖాస్తులతో సౌతాఫ్రికాఇండియా మ్యాచ్ రెండో స్థానంలో నిలవగా, 80,000కు పైగా అప్లికేషన్లతో ఇండియాఆస్ట్రేలియా మ్యాచ్ మూడో స్థానంలో ఉంది. ఇవే కాకుండా మరో ఇండియాపాకిస్థాన్ మ్యాచ్‌కి కూడా ఫ్యాన్స్ నుంచి భారీ రెస్పాన్స్ వస్తోంది. నవంబర్ 7న జరగబోయే ప్రీసీడెడ్ సూపర్ 7 రౌండ్‌లో ఇండియా (A1), పాకిస్థాన్ (A3) త్యాగయ్యే మ్యాచ్ కోసం దాదాపు 75,000 అప్లికేషన్లు వచ్చాయి. ఇక జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ మైదానంలో జరిగే గ్రాండ్ ఫైనల్ మ్యాచ్ టికెట్ల కోసం దాదాపు 65,000 మంది అభిమానులు పోటీ పడుతున్నారు.

ఈ టోర్నీ టికెట్ ధరలు అందరికీ అందుబాటులో ఉండేలా ప్లాన్ చేశారు. ప్రారంభ టికెట్ ధర 9.62 అమెరికన్ డాలర్లు (రూ. 158) కాగా, హై టైర్ మ్యాచ్‌లకు గరిష్ఠ ధర 31.31 అమెరికన్ డాలర్లుగా (రూ. 514) నిర్ణయించారు. వీటికి తోడు ఫ్యామిలీ బండిల్స్, విద్యార్థులు, పెన్షనర్లకు ప్రత్యేక తగ్గింపులు, స్థానికులకు ముందస్తు కేటాయింపులతో పాటు కమ్యూనిటీ క్లబ్‌లు, పాఠశాల విద్యార్థుల బృందాల కోసం ప్రత్యేక ఆఫర్లను కూడా సిద్ధం చేశారు. కేవలం 48 గంటల్లోనే దాదాపు పది లక్షలకు పైగా టికెట్ అప్లికేషన్లు రావడం ఈ ప్రపంచకప్‌కు ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపిస్తోందని ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా ఆనందం వ్యక్తం చేశారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఐసీసీ మెగా పురుషుల టోర్నీ మళ్లీ ఆఫ్రికా ఖండానికి తిరిగి రావడం అక్కడ అత్యంత కీలకమైన ఘట్టమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల నుంచి దాదాపు 2.5 బిలియన్ల క్రికెట్ ప్రేమికులను ఈ టోర్నీ ఆకట్టుకోనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



## ఐపీఎల్‌కు పోటీగా షెడ్యూల్..
## పీఎస్ఎల్‌కు కష్టమే బాసూ!

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 12వ సీజన్‌కు సంబంధించి కీలక ప్రకటన చేసింది. 2027 మార్చి 18 నుంచి మే 2 వరకు టోర్నీ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 1న లండన్‌లో జరిగిన పీఎస్ఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఎనిమిది ఫ్రాంచైజీల యజమానులు, ప్రతినిధులతో చర్చించిన అనంతరం షెడ్యూల్ ఖరారు చేసింది. 2026లో ఎనిమిది జట్లకు విస్తరించిన లీగ్.. వరుసగా రెండో ఏడాది కూడా అదే ఫార్మాట్‌లో జరగనుంది. గత సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో టైటిల్ గెలుచుకున్న పెషావర్ జల్మీ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. మే 3న గడ్డాఫీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో కొత్తగా లీగ్‌లోకి వచ్చిన హైదరాబాద్ కింగ్స్‌మెన్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించి పెషావర్ విజేతగా నిలిచింది. 2026 సీజన్‌లో ఎనిమిది జట్లు పోటీపడగా.. హైదరాబాద్ కింగ్స్‌మెన్, రావల్పిండిజ్ కొత్త ఫ్రాంచైజీలుగా చేరాయి. అంతేకాకుండా ఆటగాళ్ల ఎంపికలో గతంలో ఉన్న డ్రాఫ్ట్ విధానానికి బదులుగా వేలం పద్ధతిని ప్రవేశపెట్టారు.

పీఎస్ఎల్ 2026 సీజన్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభించిందని పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో ప్రేక్షకులు స్టేడియాలకు రావడంతో పాటు ప్రసారాలకూ విశేష ఆదరణ లభించిందని తెలిపారు. పీఎస్ఎల్ 12వ సీజన్‌ను మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఎనిమిది ఫ్రాంచైజీలు మరోసారి టైటిల్ కోసం పోటీపడనున్నాయని పేర్కొన్నారు. గత సీజన్‌లో గడ్డాఫీ స్టేడియంలో జరిగిన ఫైనల్‌కు 32,461 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. ఇది టోర్నీ చరిత్రలో రికార్డు స్థాయి ప్రేక్షకుల హాజరు. ఈ విజయాన్ని కొనసాగిస్తూ 2027 సీజన్‌లోనూ మరింత ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు, మెరుగైన ప్రసార అనుభవాన్ని అందించాలని పీసీబీ లక్ష్యంగా పెట్టుకుంది.

పీఎస్ఎల్ 2027 కోసం ఫ్రాంచైజీలు తమ జట్లను సిద్ధం చేసుకునే ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. ఇందుకోసం ఆటగాళ్లను నేరుగా ఒప్పందం చేసుకోవడం, పాత జట్ల నుంచి ఆటగాళ్లను రిటైన్ చేసుకోవడం, ట్రేడ్ విండో, ఆటగాళ్ల వేలం వంటి దశలు జరగనున్నాయి. 2026లో ప్రవేశపెట్టిన రెండేళ్ల కాంట్రాక్టుల విధానం ప్రకారం.. ఫ్రాంచైజీలు తమ గత సీజన్ జట్టు నుంచి గరిష్ఠంగా ఏడుగురు ఆటగాళ్లను కొనసాగించవచ్చు. ప్రతి జట్టులో 16 నుంచి 20 మంది ఆటగాళ్లు ఉండాలి. ఇందులో కనీసం ఇద్దరు అన్‌క్యాప్డ్ అండర్23 ఆటగాళ్లు తప్పనిసరిగా ఉండాలి. అంతేకాకుండా ప్రతి మ్యాచ్‌లో ఆడే తుది జట్టులో కనీసం ఒక అండర్23 ఆటగాడికి అవకాశం కల్పించాలి. ఈ నిబంధనల నేపథ్యంలో ఫ్రాంచైజీలు తమ జట్ల కూర్పుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నాయి.

పీఎస్ఎల్ 2027లో ఇస్లామాబాద్ యునైటెడ్, కరాచీ కింగ్స్, లాహోర్ ఖలందర్స్, ముల్తాన్ సుల్తాన్స్, పెషావర్ జల్మీ, క్వెట్టా గ్లాడియేటర్స్, హైదరాబాద్ కింగ్స్‌మెన్, రావల్పిండిజ్ జట్లు పోటీపడనున్నాయి. అయితే మార్చి నుంచి మే వరకు టోర్నీ జరగనుండటంతో విదేశీ ఆటగాళ్ల లభ్యత ఫ్రాంచైజీలకు సవాలుగా మారే అవకాశం ఉంది. ఇదే సమయంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కూడా జరగనుండటంతో.. కొన్ని దేశాల ఆటగాళ్లకు షెడ్యూల్ పరంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. చాలా మంది ప్లేయర్స్ ఐపీఎల్ ఆడేందుకే ఆసక్తి చూపుతారు. దాంతో పీఎస్ఎల్‌కు షాక్ తగలనుంది.

# కుర్రాళ్లు భయపడడంలేదు..
# కుమ్మేస్తున్నారు: గేల్




ఆధునిక క్రికెట్‌లో యువ బ్యాటర్లు ప్రదర్శిస్తున్న నిర్భయమైన, దూకుడైన ఆటతీరును వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్ ప్రశంసించాడు. కొత్త తరం క్రికెటర్లు ఎలాంటి జంకు లేకుండా మొదటి బంతి నుంచే దాడికి దిగడం వల్లే ఆటలో స్కోరింగ్ రేటు, పవర్ హిట్టింగ్ గణనీయంగా పెరిగాయని ఈ 'యూనివర్స్ బాస్' అభిప్రాయపడ్డాడు. ఈ మార్పు క్రికెట్‌కు సానుకూలమైన పరిణామమని పేర్కొన్నాడు. షార్జా క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (WCL) సందర్భంగా గేల్ మీడియాతో మాట్లాడాడు. "బౌలర్లు కాకుండా బ్యాటర్లు రికార్డులు బద్దలు కొడుతుండడం నాకు సంతోషంగా ఉంది. దీనికి కారణం, యువతరం ఇప్పుడు భయం లేని క్రికెట్ ఆడుతోంది. మొదటి బంతి నుంచే దాడి చేస్తున్నారు. ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడుతున్నారు. ఆట మారింది, ఆటగాళ్లు మారారు. పరుగులు చేయడానికి బ్యాటర్లు ఆకలితో ఉన్నారు. వారి నిర్భయమైన ఆటతీరు క్రికెట్‌కు ఎంతో మేలు చేస్తుంది" అని గేల్ వివరించాడు. ఇదే అంశంపై వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో బౌలర్ల కోణంలో స్పందించాడు. బ్యాటర్ల దూకుడు ఆటకు అద్భుతంగా మేలు చేస్తున్నప్పటికీ, బౌలర్లు ఈ కొత్త శకానికి అనుగుణంగా తమను తాము మార్చుకోవాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పాడు. "ప్రపంచవ్యాప్తంగా బ్యాటింగ్ తీరు చూస్తుంటే, ఇప్పటి ఆటలో నేను లేనందుకు సంతోషంగా ఉంది. బ్యాటర్ల నైపుణ్యాలు విపరీతంగా పెరిగాయి. ఈ మార్పులకు అనుగుణంగా బౌలర్లు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి, కొత్త ఆవిష్కరణలు చేయాలి" అని బ్రావో అన్నాడు. భవిష్యత్తులో వన్డేల్లో 400, 500 పరుగుల స్కోర్లు కూడా ఆశ్చర్యం కలిగించవని జోస్యం చెప్పాడు. వెస్టిండీస్ ఛాంపియన్స్ జట్టు యజమాని అజయ్ సేథి మాట్లాడుతూ.. ఒకప్పుడు గేల్, బ్రావో వంటి విండీస్ స్టార్లు దూకుడైన బ్యాటింగ్‌ను ఒక సంచలనంగా ప్రారంభిస్తే, అది ఇప్పుడు ప్రపంచవ్యాప్త ట్రెండ్‌గా మారిందని పేర్కొన్నారు. "వెస్టిండీస్ ప్రారంభించిన ఈ దూకుడైన బ్యాటింగ్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్నారు. విండీస్ క్రికెట్‌కు పర్యాయపదంగా మారిన నిర్భయమైన విధానం ఇప్పుడు అన్ని దేశాల జట్లలో కనిపిస్తోంది" అని అన్నారు.




## ఇప్పటికీ ఫిట్.. బరువు తగ్గకుండానే
## బలం పెంచిన భువనేశ్వర్ కుమార్!

టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో అందరినీ ఆశ్చర్యపరిచడం తెలిసిందే. 36 ఏళ్ల వయసులోనూ స్థిరంగా 140 కిలోమీటర్ల వేగంతో బంతులు విసరడమే కాకుండా, ఏకంగా 28 వికెట్లు పడగొట్టి ఓ భారత బౌలర్‌గా అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. వయసు పైబడటంతో కెరీర్ ముగిసిపోయిందనుకున్న దశలో.. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు టీమిండియాలోకి పునరాగమనం చేశాడు. ఈ రేంజ్ పునరాగమనం వెనుక అతడి కఠోర శ్రమ, అసాధారణ శారీరక పరివర్తన ఉంది. ఈ మార్పు వెనుక ఉన్న రహస్యాలను అతడి పర్సనల్ ట్రైనర్ సూర్య యాదవ్ ఓ జాతీయ మీడియాకు వెల్లడించాడు. గత మూడేళ్లలో భువనేశ్వర్ తన శరీరాన్ని పూర్తిగా మార్చుకున్నాడు. ఆసక్తికరమైన విషయమేమిటంటే, అతడి బరువులో పెద్దగా మార్పు రాలేదు. అప్పుడు, ఇప్పుడు కూడా భువీ బరువు సుమారు 7374 కిలోలే. కానీ, అసలు మార్పంతా శరీరంలోని కొవ్వు, కండరాల నిష్పత్తిలోనే ఉంది. మూడేళ్ల క్రితం భువీ శరీరంలో కొవ్వు శాతం (బాడీ ఫ్యాట్) దాదాపు 20 శాతం ఉండగా, కఠోర శ్రమతో దాన్ని 1314 శాతానికి తగ్గించుకున్నాడు. అంటే, కొవ్వును కరిగించి, ఆ స్థానంలో కండరాల బలాన్ని పెంచుకున్నాడు. ఇది ఫాస్ట్ బౌలర్‌కు అత్యంత కీలకం. గతంలో వెన్ను, చీలమండ, మోకాలి గాయాలతో ఇబ్బందిపడిన భువనేశ్వర్‌కు బరువులు ఎత్తే శిక్షణ అంటే కాస్త భయం ఉండేది. అయితే, ట్రైనర్ సూర్య యాదవ్ అతడిని నెమ్మదిగా ప్రోగ్రెసివ్ రెసిస్టెన్స్ ట్రైనింగ్‌కు అలవాటు చేశాడు. ఫలితంగా, ఒకప్పుడు స్క్వాట్స్‌లో కేవలం 40 కిలోల బరువును కష్టంగా ఎత్తిన భువీ, ఇప్పుడు ఏకంగా 110120 కిలోల బరువును సునాయాసంగా ఎత్తే స్థాయికి చేరుకున్నాడు. ఇది అతడి కాళ్లలో పెరిగిన బలానికి నిదర్శనం. భువనేశ్వర్ శిక్షణ కేవలం జిమ్‌కే పరిమితం కాలేదు. వారంలో 56 రోజులు, రోజుకు 5 నుంచి 7 గంటల పాటు కఠినమైన ప్రణాళికను అనుసరించాడు. ఇందులో హెవీ స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఒలింపిక్ లిఫ్ట్స్, పేలుడు శక్తిని పెంచే ప్లయోమెట్రిక్స్, జంపింగ్ డ్రిల్స్, బౌలింగ్ ప్రాక్టీస్, గాయాల నివారణకు సంబంధించిన వ్యాయామాలు ఉండేవి. ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం.. ఫాస్ట్ బౌలింగ్ సమయంలో శరీరంపై పడే తీవ్రమైన ఒత్తిడిని తట్టుకునేలా శరీరాన్ని బలోపేతం చేయడమే. ముఖ్యంగా వెన్నుపై భారం తగ్గించి, తన సహజమైన స్వింగ్, బ్యాక్‌స్పిన్‌ను కాపాడుకునేలా బౌలింగ్ మెకానిక్స్‌ను మెరుగుపరిచాడు. ఈ అంకితభావం, కఠోర శ్రమ ఫలితమే ఐపీఎల్ 2026లో కనిపించింది. నిలకడైన వేగంతో, అద్భుతమైన స్వింగ్‌తో ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టి, తన కెరీర్‌కు కొత్త ఊపిరి పోసుకున్నాడు. త్వరలో జరిగే న్యూజిలాండ్ టూర్లోనూ సత్తా చాటేందుకు తహతహలాడుతున్నాడు. భువనేశ్వర్ పరివర్తన ఎందరో యువ అథ్లెట్లకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

## కోహ్లీ అంటే నానా పటేకర్‌కు ఎంత అభిమానమో..

- వైరల్ అవుతున్న పాత వీడియో!



ప్రముఖ నటుడు నానా పటేకర్ మరణంతో సినీ అభిమానులు విషాదంలో మునిగిపోయారు. ఈ సమయంలో ఆయనకు భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై ఉన్న అభిమానం తెలిపే పాత వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విరాట్ త్వరగా ఔటైతే తనకు భోజనం చేయాలనిపించదని నానా పటేకర్ ఆ వీడియోలో చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. వైరల్ అవుతున్న వీడియోలో నానా పటేకర్ మాట్లాడుతూ.. "విరాట్ అంటే నాకు చాలా ఇష్టం. అతడు ఒక అద్భుతమైన ఆటగాడు. విరాట్ త్వరగా ఔటైతే నాకు భోజనం చేయాలనిపించదు" అని చెప్పినట్లు కనిపిస్తోంది. దీంతో క్రికెట్‌పై, ముఖ్యంగా విరాట్ కోహ్లీపై ఆయనకు ఉన్న అభిమానం ఎంతలా ఉందో అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. నానా పటేకర్ మృతిపై పలువురు మాజీ క్రికెటర్లు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ భారత క్రికెటర్ శిఖర్ ధావన్ ఆయనను ప్రత్యేక ప్రతిభ ఉన్న నటుడిగా అభివర్ణించారు. నానా పటేకర్ చేసిన పనులు ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొంటూ సోషల్ మీడియాలో నివాళులు అర్పించారు. మాజీ భారత బ్యాటర్ అజింక్య రహానే కూడా నానా పటేకర్ మృతిపై విచారం వ్యక్తం చేశారు. ఆయన అద్భుతమైన నటుడని, ఎన్నో తరాలను తన నటనతో అలరించారని గుర్తు చేసుకున్నారు. 1978లో వచ్చిన 'గమన్' సినిమాతో నటుడిగా నానా పటేకర్ కెరీర్ ప్రారంభమైంది. 'పరిందా', 'అగ్నిసాక్షి' వంటి సినిమాల్లో ప్రతినాయక పాత్రలతో ఆకట్టుకున్న ఆయన.. 'వెల్‌కమ్'లో తన కామెడీ టైమింగ్‌తోనూ ప్రేక్షకులను అలరించారు. ఇటీవలి కాలంలోనూ నానా పటేకర్ పలు సినిమాల్లో కనిపించారు. 'హౌస్‌ఫుల్ 5'లో నటించిన ఆయన.. షాహిద్ కపూర్, తృప్తి డిమ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన 'ఓ'రోమియో'లో పోలీస్ అధికారిగా కనిపించారు. అనిల్ కపూర్, రాధికా మదన్ నటించిన 'సుబేదార్'లోనూ అతిథి పాత్రలో కనిపించారు.

## వైభవ్ విషయంలో తొందరొద్దు..
## వినోద్ కాంబ్లీని గుర్తుచేసిన కపిల్ దేవ్!

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై వస్తున్న ప్రశంసల నేపథ్యంలో భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. అద్భుత ప్రతిభ ఉన్నప్పటికీ, అతని కెరీర్‌పై ఇప్పుడే భారీ అంచనాలు పెట్టుకోవడం తొందరపాటు అవుతుందని హెచ్చరించాడు. ప్రతిభ ఒక్కటే సుదీర్ఘ కెరీర్‌కు గీటురాయి కాదని చెబుతూ, మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఉదంతాన్ని ఉదాహరణగా చూపించాడు. ఈ విషయంపై కపిల్ దేవ్ మాట్లాడుతూ... "ఇప్పుడే అతని గురించి మాట్లాడటం తొందరపాటు అవుతుంది. అతనికి సామర్థ్యం ఉందా? అంటే.. కచ్చితంగా ఉంది. కానీ క్రికెట్‌లో ఎంతో మంది అపారమైన ప్రతిభతో అరంగేట్రం చేసి, ఆ తర్వాత కనుమరుగైపోయారు" అని అన్నాడు. "వినోద్ కాంబ్లీని చూడండి. దాని గురించి మనం ఏం చెప్పగలం?" అని ప్రశ్నించాడు. "వైభవ్‌కు ఇప్పుడు 15 ఏళ్లు. అతనికి మరో మూడేళ్ల సమయం ఇవ్వండి, ఆ తర్వాత మనం మాట్లాడదాం. అప్పటికి అతని జీవనశైలి, ఆలోచనా విధానం ఎలా మారతాయో చూడాలి. ప్రస్తుత ప్రదర్శన కంటే రాబోయే రెండేళ్లలో అతను తనను తాను ఎలా మలచుకుంటాడనేది చాలా ముఖ్యం" అని కపిల్ వివరించాడు. ఐపీఎల్ 2026లో 776 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ గెలవడం, అండర్19 ప్రపంచకప్ ఫైనల్‌లో 80 బంతుల్లోనే అజేయంగా 175 పరుగులు చేయడం వంటి అద్భుత ప్రదర్శనలతో వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యువ ఆటగాడిపై మితిమీరిన అంచనాలు వద్దని కపిల్ దేవ్ స్పష్టం చేశారు.

# పంజాబ్ కింగ్స్‌కు డబుల్ షాక్..
# ఇద్దరు కీలక కోచ్‌లు గుడ్‌బై



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ఫాస్ట్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్, ఫీల్డింగ్ కోచ్ బ్రాడ్ హాడిన్ తమ పదవుల నుంచి తప్పుకున్నారు. ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌లో కీలక బాధ్యతలు చేపట్టాల్సి రావడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. వీరి నిష్క్రమణతో హెడ్ కోచ్ రికీ పాంటింగ్ నేతృత్వంలోని కోచింగ్ బృందంలో పెద్ద లోటు ఏర్పడింది. జేమ్స్ హోప్స్ క్వీన్స్‌లాండ్, బ్రిస్బేన్ హీట్ జట్లకు హెడ్ కోచ్‌గా నియమితుడు కాగా, బ్రాడ్ హాడిన్ న్యూ సౌత్ వేల్స్ జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఇదివరకే పంజాబ్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న సైరాజ్ బహుతులే భారత జట్టు కోచింగ్ సిబ్బందిలో చేరగా, ఇప్పుడు మరో ఇద్దరు కీలక సభ్యులు దూరం కావడం పంజాబ్ యాజమాన్యానికి కొత్త సవాలుగా మారింది. హోప్స్ గత రెండు సీజన్లుగా పంజాబ్ జట్టుతో కొనసాగుతున్నాడు. గతంలో అతడు పాంటింగ్ నేతృత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ బృందంలోనూ పనిచేశాడు. బ్రాడ్ హాడిన్ 2022 నుంచి పంజాబ్ కోచింగ్ సిబ్బందిలో సభ్యుడిగా ఉన్నాడు. ప్రస్తుతం వీరిద్దరూ ఆస్ట్రేలియాలో జరుగుతున్న షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో తమ కొత్త బాధ్యతలను నిర్వహిస్తున్నారు. రికీ పాంటింగ్ 2025 సీజన్ కోసం పంజాబ్ జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. గత సీజన్ (2026)లో పంజాబ్ జట్టు అద్భుతమైన ఆరంభాన్ని అందుకుని, వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. అయితే ఆ తర్వాత అనూహ్యంగా తడబడటంతో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ గెలవని పంజాబ్, 2014, 2025 సీజన్లలో ఫైనల్‌కు చేరినప్పటికీ రన్నరప్‌గానే మిగిలిపోయింది.

## నా ఇంటర్వ్యూకు గంగూలీ హాజరు కాకపోవడం తీవ్రంగా బాధించింది

తనను భారత క్రికెట్ జట్టుకు డైరక్టర్‌గా తప్పించడం సరిగా అనిపించలేదని రవిశాస్త్రి తెలిపారు. 2016లో తనను కాదని అనిల్ కుంబ్లేను ప్రధాన కోచ్‌గా నియమించారని.. తన ఇంటర్వ్యూకు గంగూలీ హాజరు కాకపోవడం మరింత బాధించిందని గుర్తు చేసుకున్నారు. 2014లో టీమ్‌ఇండియాకు రవిశాస్త్రి డైరక్టర్ ఆఫ్ క్రికెట్ పదవిలో ఉన్నారు. రెండేళ్ల తర్వాత ఆ పదవిని బీసీసీఐ తీసేసింది. ప్రధాన కోచ్ పదవికి దరఖాస్తు చేయాలని రవిశాస్త్రికి సూచించింది. సౌరభ్ గంగూలీ, సచిన్ తెందుల్కర్, వీవీఎస్ లక్ష్మణ్‌తో కూడిన క్రికెట్ సలహా మండలి చివరి క్షణంలో రవిశాస్త్రిని కాదని కుంబ్లేను ఎంపిక చేసింది. "నేను డైరక్టర్‌గా ఉన్నా. రెండేళ్ల తర్వాత బోర్డు సభ్యులు వచ్చి ఆ పదవిని రద్దు చేస్తున్నాం.. హెడ్ కోచ్ పదవికి దరఖాస్తు చేయమని చెప్పింది. నన్ను బయటకు పంపించేందుకు మరో కారణం ఉందని అనిపించింది. ఆ నిర్ణయం నన్ను చాలా బాధించింది. జట్టు కోసం నా శాయశక్తులా కృషి చేశా. నన్ను ఇంటర్వ్యూ చేసేందుకూ గంగూలీ గైర్హాజరు కావడం మరింత బాధపెట్టింది" అని రవిశాస్త్రి తెలిపారు.

"నా వ్యాఖ్యాత పాత్రను పోషించేందుకు వెళ్లిపోయా. ఆటతోనే మమేకమై ఉన్నా. దాదాపు ఏడాదిన్నరపాటు మంచి అనుభవం సంపాదించా. ఎన్నో పాఠాలను నేర్చుకున్నా. ప్రధాన కోచ్‌గా భారత డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చా. ఆటగాళ్లు ఎలా ఆలోచిస్తున్నారనేది అర్థం చేసుకున్నా. జీవితంలో ఇలాంటి ఒడుదొడుకులు సహజమే. వాటన్నింటినీ ఎదుర్కొని ముందుకు సాగా. అవకాశం అందిపుచ్చుకున్నా" అని రవిశాస్త్రి తెలిపారు.

## చిరంజీవి–శ్రీకాంత్ ఓదెల ప్రాజెక్ట్

# అటకెక్కినట్టేనా?

### 'ది ప్యారడైజ్' ఫలితం తర్వాత మారిన సమీకరణాలు

మెగాస్టార్ చిరంజీవి-'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో ప్రకటించిన క్రేజీ ప్రాజెక్ట్‌పై ఇప్పుడు సందేహాలు నెలకొన్నాయి. నేచురల్ స్టార్ నాని నిర్మాతగా ఈ చిత్రాన్ని ప్రకటించినప్పుడు భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ప్రస్తుతం ఈ సినిమా పట్టాలెక్కే అవకాశాలు కనిపించడం లేదనే ప్రచారం ఫిలింనగర్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.
చిరంజీవికి కథ చెప్పి శ్రీకాంత్ ఓదెల మెప్పించడంతో ఈ ప్రాజెక్ట్ అధికారికంగా ప్రకటించారు. 'బ్లడ్ ప్రామిస్' పేరుతో విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్ అప్పట్లో సంచలనం సృష్టించింది. అయితే నాని-శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన 'ది ప్యారడైజ్'పై ప్రేక్షకుల స్పందన ఈ ప్రాజెక్ట్‌పై ప్రభావం చూపిందనే చర్చ మొదలైంది. ముఖ్యంగా సినిమాలోని మితిమీరిన హింస, రక్తపాతం తీవ్ర విమర్శలకు దారితీసింది. భారీ అంచనాలతో వచ్చిన ఈ చిత్రం వాణిజ్యపరంగానూ ఆశించిన స్థాయిలో ఫలితాన్ని అందుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో తాజాగా నాని చేసిన వ్యాఖ్యలు ప్రాజెక్ట్ భవితవ్యంపై మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. 'ది ప్యారడైజ్' ఆలస్యం కాకపోయి ఉంటే చిరంజీవి-శ్రీకాంత్ ఓదెల చిత్రాన్ని ఈ ఏడాదే ప్రారంభించేవాళ్లమని, అయితే సినిమా ఆలస్యం కావడంతో చిరంజీవి ఇతర చిత్రాలకు కట్టుబడాల్సి వచ్చిందని నాని చెప్పినట్లు సమాచారం. దీంతో ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతానికి పక్కన పడినట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
అయితే పరిశ్రమ వర్గాల్లో మాత్రం దీనిపై మరో రకమైన చర్చ నడుస్తోంది. 'ది ప్యారడైజ్'లో కనిపించిన హింస, సినిమాకు వచ్చిన స్పందన నేపథ్యంలో చిరంజీవి ఈ కథ విషయంలో పునరాలోచన చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వింటేజ్ మాస్ ఇమేజ్ ఉన్న చిరంజీవితో శ్రీకాంత్ ఎలాంటి కథను తెరకెక్కించబోతున్నారన్న విషయంలో ఇప్పటికే మెగా అభిమానుల్లో ఆసక్తితో పాటు ఆందోళన కూడా వ్యక్తమైంది.
ప్రస్తుతం చిరంజీవి ఇతర చిత్రాలకు కమిట్ కావడం, ఈ ప్రాజెక్ట్‌పై ఎలాంటి కొత్త ప్రకటన రాకపోవడంతో సినిమా పూర్తిగా ఆగిపోయిందా? లేక కొంతకాలం తర్వాత మళ్లీ పట్టాలెక్కుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడిని నమ్మిన నాని.. భవిష్యత్తులో శ్రీకాంత్ ఓదెలతో మరో చిత్రాన్ని చేస్తారా? అన్నదీ ఇప్పుడు టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.





## కార్గిల్ వార్‌లో నానా పటేకర్..

# అల్విదా నానా భాయ్!

కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు.. క్షణం తీరిక లేకుండా బిజీగా ఉన్నప్పుడు.. రెండు చేతులా సంపాదిస్తున్నప్పుడు.. ఎవరైనా బ్రేక్ తీసుకుంటారా..? అది ఎలాంటి కెరీర్ అయినా సరే దాన్ని వదులుకుంటారా..? దేశం కోసం అలా కెరీర్‌కి బ్రేక్ ఇచ్చిన ఓ వ్యక్తి ఉన్నారు.. ఆయనే నానా పటేకర్. సినిమాల్లో పాత్రల ద్వారా అద్భుతమైన నట విన్యాసాలను ప్రదర్శించడమే కాదు.. అవసరమైనప్పుడు దేశం కోసం శత్రువులతో పోరాడిన వీరుడు నానా పటేకర్. అది 1999వ సంవత్సరం.. దేశాన్ని మన శత్రువులు చుట్టుముట్టిన కాలం.. కార్గిల్ యుద్ధం హోరాహోరీగా సాగుతున్న సమయం.. యావత్ దేశం సైన్యం పక్షాన నిలడిన సందర్భం. ఇండో పాక్ సరిహద్దుల్లో కార్గిల్ వద్ద సాగుతున్న యుద్ధానికి సంబంధించిన వార్తలను తెలుసుకుంటూ దేశ ప్రజలందరూ పాక్ ఓటమి కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న సమయంలో... నానాపటేకర్ మాత్రం భిన్నంగా స్పందించారు. బిజీ సినిమా షెడ్యూల్ ను పక్కన పెట్టి సరిహద్దుల్లోకి వెళ్లి పోరాడాలని నిర్ణయించుకున్నారు.
1980ల చివర్లో నానా పటేకర్ టెరిటోరియల్ ఆర్మీలో అధికారికంగా చేరారు. 1991లో వచ్చిన 'ప్రహార్ ది ఫైనల్ ఎటాక్' సినిమాలో ఆర్మీ కమాండో పాత్ర కోసం ఆయన షార్ట్‌కట్స్ వాడకుండా ఏకంగా మూడేళ్ల పాటు శిక్షణ తీసుకున్నారు. మరాఠా లైట్ ఇన్‌ఫాంట్రీతో కలిసి తీసుకున్న శిక్షణ ఆయనను ఆర్మీకి మరింత దగ్గర చేసింది. అందుకే కార్గిల్ యుద్ధ సమయంలో తనకు దేశానికి సేవ చేసే అవకాశం ఇవ్వాలని టెరిటోరియల్ ఆర్మీలో సీనియర్ అధికారులకు రిక్వెస్ట్ పెట్టుకున్నారు. అయితే ఆ అధికారం తమకు లేదని... రక్షణ మంత్రి మాత్రమే నిర్ణయం తీసుకోగలరని వారు స్పష్టం చేశారు.
పై అధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోయినా... ఏ మాత్రం నిరాశ చెందని నానా పటేకర్... అప్పటి రక్షణ మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్‌ను కలిసి.. తనకు ముందుండి పోరాడేందుకు అనుమతించాలని అభ్యర్థించారు. షూటింగ్ నైపుణ్యాలు, గెలుచుకున్న పతకం గురించి మంత్రికి వివరించారు. అనుమతి లభించిన వెంటనే తన సినిమా కెరీర్‌ను పక్కనపెట్టి ఆర్మీకి చెందిన క్విక్ రియాక్షన్ టీమ్ లో చేరారు. శ్రీనగర్, ద్రాస్, లేహ్ ప్రాంతాల్లో ఆర్మీతో కలిసి 60 రోజులు ఉన్నారు. బాలీవుడ్ సెలబ్రిటీని అన్న విషయాన్ని పక్కనపెట్టి... సైనికులతో కలిసి శత్రువులతో పోరాడారు. బోర్డర్ లో ఉన్న సమయంలో ఆయన సుమారు 20 కేజీల బరువు కూడా తగ్గారు. ఇండియన్ సిల్వర్ స్క్రీన్ పై ఎంతో మంది నటీనటులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కానీ నానాపటేకర్ లాంటి మానవత్వం ఉన్న నటులు మాత్రం చాలా అరుదుగానే ఉంటారు. నాటకాలతో పాటు మరాఠీ, హిందీ సినిమాల్లో అద్భుతమైన నటన కనబరిచిన నానా పటేకర్ చాలా క్రమశిక్షణతో ఉండేవారు. ఏ పాత్రనైనా అవలీలగా చేయగల అరుదైన నటుల్లో ఆయన పేరు ముందు వరుసలో ఉంటుంది. అల్విదా నానా భాయ్.

## ప్రభాస్ ఫ్యాన్స్ కు

# డబుల్ ట్రీట్..

### పుట్టినరోజున 'ఫౌజీ', 'స్పిరిట్' నుంచి అదిరిపోయే అప్‌డేట్స్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'ఫౌజీ' ఒకటి. 'సీతారామం' ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 1940ల స్వాతంత్ర్య పూర్వ కాలం నేపథ్యంలో రూపొందుతోంది. ఇమాన్వి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మాతలు రవిశంకర్, నవీన్ యెర్నేని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గతంలో ప్రకటించిన చిత్రబృందం.. తాజాగా విడుదలను వాయిదా వేసినట్లు స్పష్టం చేసింది. దీంతో ప్రభాస్ అభిమానులు కాస్త నిరాశకు గురయ్యారు. అయితే వారికి ఉత్సాహాన్నిచ్చేలా తాజాగా ఓ ఆసక్తికరమైన సమాచారం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ప్రభాస్ పుట్టినరోజైన అక్టోబర్ 23న 'ఫౌజీ' నుంచి ప్రత్యేక మెరుపు దృశ్యాలను విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు సమాచారం. విడుదల తేదీ వాయిదా పడిన నేపథ్యంలో అభిమానులకు ఇది ప్రత్యేక కానుకగా నిలవనుందని తెలుస్తోంది. అదే రోజు ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' నుంచి కూడా అధికారిక పోస్టర్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఒకే రోజున ప్రభాస్ నటిస్తున్న రెండు భారీ చిత్రాల నుంచి అప్‌డేట్స్ రానుండటంతో అభిమానుల్లో ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. ఈ రెండు అప్‌డేట్స్‌తో ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు మరింత గ్రాండ్‌గా మారనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి.

# పవన్ కల్యాణ్ అంటే చిన్నప్పటి నుంచే ఇష్టం: ఆనంది







తెలుగు, తమిళ చిత్రాల్లో విభిన్న పాత్రలు చేస్తూ గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ ఆనంది.. తన అభిమాన హీరో పవన్ కల్యాణ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన కొత్త సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. తనకు నచ్చిన హీరో ఎవరనే ప్రశ్నకు సమాధానమిచ్చారు. తాను పవన్ కల్యాణ్‌కు వీరాభిమానినని ఆనంది తెలిపారు. చిన్నతనం నుంచే ఆయనపై క్రష్ ఉండేదని చెప్పారు. తెరపై పవన్ కల్యాణ్ చూపించే మ్యానరిజమ్స్, ప్రత్యేకమైన స్టైల్ తనను ఎంతగానో ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు. ఆయన సినిమా విడు దలవుతుందంటే తనకు పండగలా అనిపిస్తుందని తెలిపారు. నటిగా మారిన తర్వాత కూడా పవన్ కల్యాణ్‌పై తనకున్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని ఆనంది వెల్లడించారు.

బాలీవుడ్‌లో గ్లామర్ పాత్రలతో ఎక్కువగా కనిపించిన దిశా పటాని.. ఇకపై తన కెరీర్‌లో విభిన్నమైన పాత్రలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిపారు. 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ'తో సినీ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె.. ఆ చిత్రానికి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ పదేళ్లలో నటిగా ఎన్నో అనుభవాలు

## నటిగా ఆ ఒక్కదానికే పరిమితం కాను: దిశా పటాని

తనను మరింత పరిణతి చెందిన నటిగా తీర్చిదిద్దాయని దిశా పటాని పేర్కొన్నారు. ఇప్పటివరకు గ్లామర్‌కు ప్రాధాన్యమున్న పాత్రలు ఎక్కువగా చేశానని, ఇకపై కొత్త తరహా కథలు, పాత్రలతో ప్రయోగాలు చేయాలని ఉందన్నారు. కేవలం తెరపై అందంగా కనిపించడం కాకుండా.. కథలో కీలకంగా నిలిచే పాత్రలు పోషించి నటిగా తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా తనలోని నటనను బయటపెట్టే అవకాశాల కోసం ఎదురుచూస్తున్నట్లు దిశా పటాని తెలిపారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com